


# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

శనివారం,
జనవరి 11, 2025

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-

## సూర్యాపేట జిల్లాలో లారీని ఢీకొన్న ట్రావెల్స్ బస్సు



ఐదుగురు వలస కూలీల మృతి..

అంతా ఒడిశా వారే

జనగామ జిల్లాలో రోడ్డు ప్రమాదం..

ఇద్దరు దుర్మరణం

మృతులంతా ఒడిశాకు చెందిన వారే

## కాంగ్రెస్, బీఆర్ఎస్ కుమ్మక్కు రాజకీయాలు

ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలకు కేసీఆర్ కప్పం

లోపాయికారి ఒప్పందం చేసుకున్న రేవంత్

అందుకే కేటీఆర్‌ను ఏమీ చేయడం లేదు

ఫార్ములా-ఈ రేసు కేసులో చర్యలు లేవేం?

700 కోట్ల లాభం ఎలా వచ్చిందో చెప్పాలి..

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి సంజయ్



## మరిన్ని పిచ్చి కేసులతో వేధిస్తారు: బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్

నాయకుల ఆత్మస్థైర్యం దెబ్బతీయాలని రేవంత్ చూస్తున్నారు

అయినా ప్రజా సమస్యలపైనే దృష్టి పెట్టాలి

పార్టీ నాయకులకు మాజీ సీఎం ఉద్బోధ

కేసీఆర్‌తో కేటీఆర్, హరీశ్‌రావు భేటీ

ఏసీబీ విచారణ తీరుపై వివరించిన కేటీఆర్



హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం పసలేని కేసులు నమోదు చేసి, పార్టీ నేతలను ఇబ్బందులకు గురి చేసినా ప్రజా సమస్యలను ఎత్తి చూపడంపైనే దృష్టి కేంద్రీకరించాలని బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు పార్టీ నేతలను ఆదేశించారు. 'ఫార్ములా ఈ- రేస్' కేసులో ఏసీబీ విచారణకు హాజరైన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు శుక్రవారం కేసీఆర్‌తో భేటీ అయ్యారు. గురువారం ఏసీబీ విచారణ అనంతరం నందినగర్ నివాసానికి వెళ్లిన కేటీఆర్, శుక్రవారం తన భార్యతో కలసి ఎర్రవల్లి నివాసానికి వెళ్లారు. మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, మరో నేత కార్తీక్‌రెడ్డి కూడా కేసీఆర్‌తో జరిగిన ఈ భేటీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏసీబీ విచారణలో అధికారులు అడిగిన ప్రశ్నలు, తాను ఇచ్చిన (మిగతా 2వ పేజీలో)



## కలెక్టర్లూ.. మారండి!

**ఇష్టం లేకుంటే చెప్పండి.. వేరేచోటకు పోస్టింగ్.. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవు**

ఈ నెల 26 నుంచి 4 ప్రతిష్ఠాత్మక పథకాలు

24 లోగా గ్రామ సభలను నిర్వహించాలి

అర్హులందరికీ 'రైతు భరోసా' సొమ్ము ఇవ్వండి

భూమిలేని కూలీలకు 'ఆత్మీయ భరోసా'

ముందుగా అత్యంత పేదలకు ఇందిరమ్మ ఇళ్లు

కలెక్టర్ల సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు

26 తర్వాత ఆకస్మిక తనిఖీలు చేస్తానని వెల్లడి

హైదరాబాద్, జనవరి 10 : జిల్లాల కలెక్టర్ల పనితీరుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. కొంతమంది కలెక్టర్లు క్షేత్రస్థాయికి వెళ్లడంలేదని, ఆఫీసుల్లోనే కూర్చుని పని చేయాలనుకుంటున్నారని తప్పుబట్టారు. ఇది మంచి పద్ధతి కాదని, వారు మారాలని, ఇక నుంచైనా క్షేత్రస్థాయికి వెళ్లాలని సూచించారు. ఐఏఎస్ అధికారి జిల్లా కలెక్టర్‌గా పనిచేయడం ఓ మధురానుభూతి అని చెప్పారు. "ఒకవేళ ఎవరికైనా కలెక్టర్‌గా పనిచేయడం ఇష్టం లేకపోతే చెప్పండి.. వేరేచోట పోస్టింగ్ ఇస్తా" అని అన్నారు. శుక్రవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో సచివాలయంలో ముఖ్యమంత్రి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్లకు ప్రత్యేకంగా కొన్ని సూచనలు చేశారు. "గతంలో ఉమ్మడి జిల్లాలుగా ఉన్నప్పుడు ఒక జిల్లాకు వెళ్లాలన్నా, ఏదైనా తండాలు, మారుమూల ప్రాంతాలకు వెళ్లి రావాలన్నా కనీసం రెండు రోజుల సమయం పట్టేది. ఇప్పుడు ఆ సమస్య లేదు..

(మిగతా 2వ పేజీలో)

## నేనూ మనిషినే.. భగవంతుణ్ని కాదు!


పొరపాట్లు చేసే ఉంటా.. కానీ, దురుద్దేశంతో తప్పులు చేయలేదు

గాంధీ, సావర్కర్ మార్గాలు వేరైనా.. 'స్వాతంత్ర్యం' వారి సిద్ధాంతం

ప్రజా సేవ చేయాలన్న మిషన్‌తోనే రాజకీయాల్లోకి రావాలి

ఎన్నికల్లో అలా మాట్లాడాల్సి వచ్చింది.. ఎన్నికలు ముగిశాక పాలనపైనే నా దృష్టి

జెరోదా సహ వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్‌కు ప్రధాని మోదీ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూ



న్యూఢిల్లీ, జనవరి 10: ప్రధాని మోదీ తొలిసారి ఓ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. ఇదే ఒక విశేషమైతే.. రెండు గంటల పాటు సాగిన ఈ ఇంటర్వ్యూలో ఆయన తన శైలికి విరుద్ధంగా మాట్లాడి, అందరినీ ఆశ్చర్యపరిచారు. తానూ మనిషినేనని, పొరపాట్లు జరుగుతాయని చెప్పారు. "గుజరాత్ సీఎంగా ఉన్న సమయంలో కష్టపడి పనిచేయడానికి ఉన్న ఏ అవకాశాన్నీ వదలబోనని చెప్పా. నా కోసం ఏమీ చేసుకోలేదు. నేను దురుద్దేశంతో ఎన్నడూ తప్పులు చేయలేదు. ఇదే నా జీవన మంత్రం. తప్పులనేవి అనివార్యమైనవి. నేను కూడా చేసే ఉంటా. ఎందుకంటే నేనూ మనిషినే! నేనేమీ భగవంతుణ్ని కాదు కదా?" అని మోదీ పేర్కొన్నారు. ప్రముఖ వ్యాపారవేత్త, జెరోదా సహ వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్ పాడ్‌కాస్ట్‌లో ప్రధాని మోదీ అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇద్దరూ పలు ఆసక్తికర విషయాలపై మాట్లాడుకున్నారు. ఇంటర్వ్యూ ట్రైలర్‌ను మోదీ తన ఎక్స్ ఖాతాలో పెట్టారు. తొలుత వీడియో ట్రైలర్‌ను పోస్ట్ చేసిన కామత్.. శుక్రవారం పూర్తి వీడియోను విడుదల చేశారు. దాదాపు 2 గంటల పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో రాజకీయాలు,

(మిగతా 2వ పేజీలో)



## బాబోయ్ సంక్రాంతి.. బస్ టికెట్ ధర రూ.5 వేలకు పైమాటే

హైదరాబాద్ : సంక్రాంతికి పండుగ కోసం పట్నం నుంచి పల్లెబాట పట్టిన ప్రయాణికులకు ప్రైవేట్ ట్రావెల్స్ ఝలక్ ఇస్తున్నాయి. ప్రయాణికుల జేబుకు చిల్లు పెడుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా టికెట్ ధరల్ని అమాంతం పెంచి సొమ్ము చేసుకుంటున్నాయి. ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యాలు ఇష్టారీతిన టికెట్ ఛార్జీలు పెంచినా రవాణా శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పండుగ వేళ ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యాలు ఆర్టీసీ బస్సుల కంటే రెండు నుంచి మూడుంతలు అదనంగా వసూలు చేస్తున్నాయి. దీంతో అడ్డగోలుగా పెంచిన ఛార్జీలతో హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్లే ప్రయాణికులు ఒక్కో కుటుంబం

(మిగతా 2వ పేజీలో)

## బెనిఫిట్ షోలు రద్దంటూ.. ప్రత్యేక షోలకు పర్మిషన్లు ఎందుకు?: తెలంగాణ హైకోర్టు




## జేఈఈ మెయిన్ పరీక్ష కేంద్రాలు వెల్లడి



వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచిన ఎన్‌టీఏ..

రిజిస్ట్రేషన్ నంబర్‌తో లాగిన్ అయ్యి తెలుసుకోవచ్చు

22 నుంచి 30వ తేదీ వరకు మెయిన్ మొదటి సెషన్ పరీక్షలు

# కలెక్టర్లూ.. మారండి!



ఏ జిల్లాలోని ఏ మారుమూల ప్రాంతానికి వెళ్లి రావాలన్నా రెండు, మూడు గంటల్లో తిరిగి వచ్చే అవకాశాలున్నాయి. కలెక్టర్లు అందరూ జిల్లాల్లో పర్యటనలు చేయాలి. క్షేత్రస్థాయికి వెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా చర్యలు తీసుకోవాలి. మీరు మంచి పేరు తెచ్చుకుని, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలి. ప్రభుత్వానికి పూర్తిస్థాయిలో సహకరించాలి" అని సీఎం రేవంత్ అన్నారు. మహిళా ఐఏఎసలతోపాటు ఐపీఎస్ అధికారులు కూడా నెలలో ఒక్కసారైనా బాలికల హాస్టళ్లను సందర్శించాలని, అక్కడే రాత్రి బస చేసి.. విద్యార్థుల అవసరాలను, సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని సూచించారు. వారి సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలు, పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేది కలెక్టర్లేనని, వారి పనితీరే ప్రభుత్వ పనితీరుకు కొలమానం అవుతుందని అన్నారు. ఎప్పటికప్పుడు తమ పనితీరును మెరుగుపరచుకోవాలని సూచించారు. ఇటీవల కులగణన సర్వేను విజయవంతంగా పూర్తి చేశారంటూ అన్ని జిల్లాల కలెక్టర్లను అభినందించారు.

**26 నుంచి ఆ నాలుగు పథకాలు..**

భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు అయినందున.. ఈ నెల 26న జరిగే గణతంత్ర వేడుకలకు అత్యంత ప్రాధాన్యం ఉందని సీఎం రేవంత్ అన్నారు. ఆరోజు రాష్ట్ర ప్రభుత్వం.. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఇళ్లు వంటి నాలుగు ప్రతిష్ఠాత్మకమైన పథకాలను ప్రారంభించబోతున్నట్లు తెలిపారు. కలెక్టర్లు ఈ నెల 15లోగా ఈ పథకాల అమలుకు కావాల్సిన సన్నాహకాలను పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రుల సారథ్యంలో అన్ని జిల్లాల్లో నోడల్ అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలని, 24వ తేదీలోగా గ్రామ సభలు పూర్తి చేయాలని అన్నారు. ఈ నెల 26 తర్వాత తాను జిల్లాలో పర్యటిస్తానన్నారు. ఆకస్మిక తనిఖీలు చేస్తానని, ప్రభుత్వ వ్యవస్థలో ఎక్కడ నిర్లక్ష్యం కనిపించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. క్షేత్ర స్థాయి అధికారులను కూడా అప్రమత్తం చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. పేదల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి తమ ప్రభుత్వానికి రెండు కళ్ల లాంటివని సీఎం పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం పేదల కోసం పని చేస్తుందనే విశ్వాసం కల్పించాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్లపైనే ఉందన్నారు. ఈ నెల 26న ప్రారంభించనున్న నాలుగు పథకాల అమలుకు రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో గ్రామ సభలు, మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో వార్డు సభలను నిర్వహించాలని అన్నారు. ఈ పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం సేకరించిన వివరాలు, తయారు చేసిన జాబితాలను గ్రామ సభల్లోనే వెల్లడించాలన్నారు.

**అలాంటి పొరపాటు జరగొద్దు..**

గతంలో రైతుబంధు పేరిట భారీ ఎత్తున ప్రజాధనం దుర్వినియోగం అయిందని, గత ప్రభుత్వం వ్యవసాయ యోగ్యం కాని భూములకు పంట పెట్టుబడి సాయం అందించిందని సీఎం రేవంత్ అన్నారు. ఈసారి అలాంటి పొరపాటు జరగకూడదని హెచ్చరించారు. అర్హులైన రైతులందరికీ రైతు భరోసా సొమ్మును చెల్లించాలని, అదే సమయంలో అనర్హులు ఒక్కరు కూడా లబ్ధి పొందకుండా చూడాలని అన్నారు. ప్రతి జిల్లాకు, మండలానికి ఓ నోడల్ అధికారిని నియమించాలని, అధికారుల బృందాలు క్షేత్ర స్థాయికి వెళ్లి అనర్హులను గుర్తించాలని ఆదేశించారు. వ్యవసాయ యోగ్యమైన భూములన్నింటికీ రైతు భరోసా సొమ్మును చెల్లించాలని, వ్యవసాయానికి అక్కరకురాని భూములను గుర్తించి, వాటిని మాత్రమే ఈ పథకం నుంచి మినహాయించాలని అన్నారు. రియల్ ఎస్టేట్ భూములు, లే-అవుట్ భూములు, నాలా కన్వర్షన్ అయిన భూములు, మైనింగ్ భూములు, గోదాములు, ఫంక్షన్ హాళ్లు నిర్మించిన భూములు, వివిధ ప్రాజెక్టులకు, అభివృద్ధి పనులకు ప్రభుత్వం సేకరించిన భూములు ఈ అనర్హత జాబితాలోకి వస్తాయని వివరించారు. గ్రామ పంచాయతీలు, మునిసిపాలిటీల రెవెన్యూ రికార్డులు, డీటీసీపీ లే-అవుట్ రికార్డులు, సంబంధిత విభాగాల రికార్డుల్లో ఉన్న వివరాల ఆధారంగా ఈ జాబితాలను తయారు చేయాలన్నారు. విలేజ్ మ్యాప్‌లతో పాటు అధికారులు క్షేత్ర స్థాయికి వెళ్లి వీటిని ధ్రువీకరించుకుని, వీటిని గ్రామ సభలో ప్రచురించాలని చెప్పారు. రైతులు ఎలాంటి అనుమానాలు, అపోహలకు గురికావొద్దని, పంట వేసినా.. వేయకున్నా.. వ్యవసాయ యోగ్యమైన ప్రతి ఎకరానికీ రైతు భరోసా అందుతుందని స్పష్టం చేశారు.

**20 రోజులు ఉపాధి పనులు చేస్తేనే..**

భూమి లేని నిరుపేద, ఉపాధి కూలీ కుటుంబాలను ఆదుకునేందుకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని ప్రారంభించినట్లు సీఎం రేవంత్ చెప్పారు. ఆ కుటుంబానికి ఏడాదికి రూ.12 వేల నగదు సాయం అందిస్తామన్నారు. ఏడాదిలో కనీసం 20 రోజులు ఉపాధి హామీ పనులు చేసిన భూమి లేని కుటుంబాలకు ఈ పథకం వర్తిస్తుందని చెప్పారు. ఇక కొత్త రేషన్ కార్డులను.. గతంలో ఉన్న అర్హత నిబంధనల ప్రకారమే జారీ చేస్తామన్నారు. ఒకే వ్యక్తికి వేర్వేరు ప్రాంతాల్లో రేషన్ కార్డులు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో 'వన్ రేషన్- వన్ స్టేట్' విధానాన్ని తీసుకురాబోతున్నామని చెప్పారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల లబ్ధిదారుల జాబితాలను కూడా గ్రామ సభల్లో వెల్లడించాలన్నారు. ఇక ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా గూడు లేని నిరుపేదలకు ఇళ్లను నిర్మించి ఇవ్వాలనేది తమ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఇప్పటికే ఇందిరమ్మ యాప్ ద్వారా గుర్తించిన 18.32 లక్షల మంది వివరాలను జిల్లాలకు పంపించామన్నారు. అందులో అత్యంత నిరుపేదలుగా గుర్తించిన వారికి మొదటి ప్రాధాన్యమివ్వాలని చెప్పారు. తొలి విడతలో నియోజకవర్గానికి 3500 ఇళ్లను మంజూరు చేశామని, ఇందిరమ్మ ఇళ్లకు అరు?లైన వారి జాబితాలను వెంటనే సిద్ధం చేయాలని సూచించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రుల ఆమోదంతో ఈ అర్హుల జాబితాను గ్రామసభల్లో ప్రచురించాలన్నారు. సదస్సులో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, అధికారులు పాల్గొన్నారు.

# జేఈఈ మెయిన్ పరీక్ష కేంద్రాలు వెల్లడి

**వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచిన ఎన్‌టీఏ...**

**రిజిస్ట్రేషన్ నంబర్‌తో లాగిన్ అయ్యి తెలుసుకోవచ్చు**

**22 నుంచి 30వ తేదీ వరకు మెయిన్ మొదటి సెషన్ పరీక్షలు**



హైదరాబాద్: ఈ నెల 22 నుంచి జరిగే జేఈఈ మెయిన్ మొదటి విడత పరీక్షలకు సంబంధించిన పరీక్ష కేంద్రాల వివరాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) శుక్రవారం వెల్లడించింది. విద్యార్థులకు ఏ షిఫ్ట్, ఏ కేంద్రంలో, ఎన్ని గంటలకు పరీక్ష ఉంటుందనే వివరాలను వెబ్‌సైట్‌లో ఉంచింది. జేఈఈకి ఈ తరహా ముందస్తు సమాచారం ఇవ్వడం ఇదే మొదటిసారి. నోటిఫికేషన్ సమయంలో జేఈఈ పరీక్ష తేదీలను మాత్రమే ప్రకటించింది. తాజాగా పరీక్ష కేంద్రం వివరాలు తెలియజేయడంతో విద్యార్థులు ముందుగానే అవసరమైన ఏర్పాట్లు చేసుకునే వీలు కలిగింది. పరీక్ష కేంద్రం సమాచారం తెలుసుకునేందుకు జేఈఈ మెయిన్-2025 వెబ్‌సైట్‌లో లాగిన్ కావాలని శుక్రవారం ఒక ప్రకటనలో సూచించింది. జేఈఈ మెయిన్ తొలి విడతకు సంబంధించి పేపర్%-%1 పరీక్షలు 22 నుంచి 29 వరకు జరుగుతాయి. బీటెక్‌లో ప్రవేశాలకు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు. 30వ తేదీన పేపర్-2ఎ (బీఆర్క్), పేపర్-2బీ (బీ ప్లానింగ్, బీఆర్క్ మరియు బీ ప్లానింగ్) పరీక్షలు ఉంటాయి. గత రెండేళ్ల మాదిరిగానే ఈసారి ప్రశ్నపత్రాల్లో రెండు సెక్షన్లు ఉంటాయి. సెక్షన్ బీలో ఈసారి 5 ప్రశ్నలు ఇస్తారని ఎన్‌టీఏ తెలిపింది. గత మూడేళ్ల మాదిరి ఈసారి చాయిస్ ఉండదు. రెండు సెక్షన్లలో కూడా మైనస్ మార్కులు ఉంటాయి. సరైన సమాధానానికి 4 మార్కులు, తప్పుడు సమాధానానికి మైనస్ వన్ మార్కు ఉంటుంది. స్కో ర్ కోసం తొలుత గణితం, ఆ తర్వాత భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రం విభాగంలో సాధించిన మార్కులను పరిగణనలోకి తీసుకుంటారు.

# సూర్యాపేట జిల్లాలో లారీని ఢీకొన్న ట్రావెల్స్ బస్సు

చివ్వెంల, కొడకండ్ల, జనవరి 10 : సూర్యాపేట జిల్లా చివ్వెంల మండల పరిధిలోని ఐలాపురం గ్రామ స్టేజీ సమీపంలో ఖమ్మం-హైదరాబాద్ జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. టైరు పేలి రోడ్డు పక్కన నిలిపి ఉంచిన లారీని ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టిన ఘటనలో ఐదుగురు కూలీలు అక్కడికక్కడే మృతిచెందగా, 10మందికిపైగా గాయపడ్డారు. మృతుల్లో భార్యాభర్తలు, ఓ మహిళ, వృద్ధుడు, డ్రైవర్ ఉన్నారు. క్షతగాత్రుల్లో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఒడిశాలోని కోరాపుట్ జిల్లాకు చెందిన 32 మంది భవన నిర్మాణ కార్మికులు సొంతూరు నుంచి హైదరాబాద్‌కు వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బస్సులో ఇరుక్కున్న మృతదేహాలను బయటికి తీయించారు.క్షతగాత్రులను సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించారు. రెండు వాహనాలను ప్రొక్లెయినర్ల సహాయంతో పక్కకు తొలగించారు. టైరు పేలడంతో లారీని రోడ్డు పక్కకు నిలిపే సమయంలో లారీ డ్రైవర్ ఎలాంటి జాగ్రత్తలు పాటించలేదని తెలుస్తోంది. మంచు కురుస్తుండటం, బస్సు డ్రైవర్ అతివేగంగా రావడంతోనే ఆగి ఉన్న లారీని ఢీకొట్టి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. జనగామ జిల్లాలో గురువారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఇనుప రేకుల లోడ్‌తో ఉన్న డీసీఎం వాహనాన్ని తుఫాన్



వాహనం ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే దుర్మరణం చెందగా, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. అంతా ఒకే కుటుంబానికి చెందినవారు. సూర్యాపేట జిల్లా నాగారం మండలం ఈటూరు గ్రామానికి చెందిన పేరాల వెంకన్న(45), పేరాల లక్ష్మి(35)లు అక్కడికక్కడ మృతిచెందగా పేరాల ఉషయ్య, లావణ్య, ఉప్పలమ్మ, ముత్యాలు, వంగూరి నరసమ్మలకు తీవ్రగాయాలయ్యాయి. జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కడవెండిలో డోలారోహణ వేడుకలకు హాజరై తుఫాన్ వాహనంలో తిరిగి వెళ్తుండగా అర్ధరాత్రి కొడకండ్ల మండలంలోనిమైదం చెరువుతండా సమీపంలో ఈ ప్రమాదం జరిగింది.

## నేనూ మనిషినే.. భగవంతుణ్ని కాదు!

చిన్నతనంలో జరిగిన ఘటనలు, స్నేహితులు, ప్రధానిగా బాధ్యతలు, నాయకత్వ సవాళ్లు వంటి పలు అంశాలపై ఇద్దరూ చర్చించుకున్నారు. ఆరంభంలో నిఖిల్ కామత్ మాట్లాడుతూ.. 'ప్రధానిని ఇంటర్వ్యూ చేస్తున్నానంటే ఒకింత భయంగా ఉంది' అన్నారు. దానికి మోదీ బదులిస్తూ.. 'ఇదే నా తొలి పాడ్‌కాస్ట్. దీన్ని ప్రజలు ఎలా స్వీకరిస్తారో తెలియదు' అనడంతో నవ్వులు విరిశాయి. రాజకీయాల్లోకి రావాలనుకునే యువతకు మీరిచ్చే సూచన ఏంటి? అని నిఖిల్ కామత్ ప్రధానిని అడగ్గా.. "రాజనీతి కలిగిన వ్యక్తులు రావాల్సిన అవసరం ఉంది. ప్రజాసేవ చేయాలన్న మిషన్‌తో రాజకీయాల్లోకి రావాలి కానీ, వేరే యాంబిషన్(లక్ష్యం)తో కాదు" అని సమాధానమిచ్చారు. రాజనీతి కలిగిన నాయకులు ఉన్నారా? అని అడగ్గా.. దేశంలో అలాంటి యువ నాయకులు ఎంతో మంది ఉన్నారని మోదీ చెప్పారు. ఒకరి పేరు చెబితే మిగిలిన వారికి అన్యాయం సినట్లవుతుందన్నారు. ఆశయాలకు అత్యంత ప్రాధాన్యం ఉంటుందన్న ప్రధాని.. అదేసమయంలో సిద్ధాంతాలకు కూడా అంతే విలువ ఉంటుందన్నారు. సిద్ధాంతాలు లేకుండా రాజకీయాలు కూడా లేవని చెప్పారు. గాంధీ, సావర్కర్‌ల మార్గాలు వేరైనప్పటికీ వారి సిద్ధాంతం మాత్రం ఒక్కటేనన్నారు. అదే 'స్వాతంత్ర్యం' అని మోదీ చెప్పారు. ఇక తన విషయానికి వస్తే.. 'దేశం ముందు' అన్నదే తన సిద్ధాంతమని స్పష్టం చేశారు. ఇందులో భాగంగా పాత ఆలోచనలను పక్కనపెట్టి, ఎప్పటికప్పుడు కొత్తవాటికి చోటిస్తానని తెలిపారు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేలా ఒక బృందాన్ని రూపొందించుకోవాలన్నారు. తాను విజయవంతమవడానికి తన బృందమే కారణమని చెప్పారు. తాను విలక్షణ రాజకీయ నాయకుడిని కాదని మోదీ చెప్పారు. పరిపాలనపైనే తాను ఎక్కువ సమయం వెచ్చిస్తానని తెలిపారు. "ఎన్నికల సమయంలో నేను రాజకీయ ప్రసంగాలు చేశా. అది తప్పనిసరి పరిస్థితి. నాకు నచ్చకపోయినా అలా మాట్లాడాల్సి వచ్చేది. ఎన్నికలు అయిపోయిన తర్వాత నా సమయం అంతా పరిపాలన కోసమే వెచ్చిస్తా. ఇక అధికారంలో లేని సమయంలో నా దృష్టి మొత్తం సంస్థాగత పనులపైనే ఉంటుంది" అని మోదీ పేర్కొన్నారు. తానెప్పుడూ సవాళ్లను ఇష్టపడతానని, ఒక గిరి గీసుకొని అందులో హాయిగా గడపడం తనకు నచ్చదని చెప్పారు. తన గురించి ఎప్పుడూ ఆలోచించుకోనని, రిస్క్ తీసుకోవడానికే ప్రాధాన్యమిస్తానని తెలిపారు. తొలి రెండు పర్యాయాలు తాను ప్రారంభించిన అభివృద్ధి పనులను చూసి ప్రధానిగా తన పనితీరును అంచనా వేసుకునేవాడినన్నారు. మూడోసారి బాధ్యతలు స్వీకరించిన తర్వాత తన ఆలోచనలు మారిపోయాయన్నారు. 2047 కల్లా దేశాన్ని వికసిత్ భారత్‌గా మార్చాలన్నదే తన లక్ష్యమని తెలిపారు. మోదీ బాల్యం గురించి కామత్ అడగ్గా.. తానో సాధారణ విద్యార్థినని చెప్పారు. ఏ విషయంపైనా తాను పెద్దగా శ్రద్ధ పెట్టేవాడిని కాదన్నారు. అయితే భేల్జీభాయ్ చౌధరి అనే టీచర్ తనను ఎంతగానో ప్రోత్సహించేవారని మోదీ గుర్తుచేసుకున్నారు. ఆయన ఒక రోజు మా నాన్నతో 'మీ అబ్బాయి చాలా ప్రతిభావంతుడు. కానీ, దృష్టి పెట్టడు' అని చెప్పారని తెలిపారు. "ఫిబ్రవరి 24, 2002లో నేను తొలిసారి సీఎంగా గెలిచి అసెంబ్లీలో అడుగు పెట్టా. మూడు రోజుల తర్వాత ఫిబ్రవరి 27న గోధ్రా ఘటన జరిగింది. రైలుకు నిప్పు పెట్టినట్లు తొలుత మాకు సమాచారం వచ్చింది. ఆ తర్వాత అల్లర్లు, మృతుల సమాచారం వచ్చింది. అప్పుడు సభలో ఉన్న నేను ఎంతగానో ఆందోళన చెందా. వెంటనే గోధ్రాలో పర్యటిస్తానని చెప్పా. అప్పుడు ఒక్క హెలికాప్టర్ మాత్రమే ఉంది. అది సింగిల్ ఇంజన్ హెలికాప్టర్ అని, వీఐపీలను అందులో ప్రయాణించడానికి అనుమతించబోమని అధికారులు చెప్పారు. ఏం జరిగినా నాదే బాధ్యత అని వారితో వాదించా. వెంటనే గోధ్రా వెళ్లా. అక్కడ మృతదేహాలు, హృదయవిదారకమైన దృశ్యాలు చూసి చలించిపోయా. కానీ, నేను సీఎం హోదాలో ఉండడంతో భావోద్వేగాలను అదుపులో పెట్టుకోవాల్సి వచ్చింది. నన్ను నేను నియంత్రించుకోవడానికి ఎంతో చేయాల్సి వచ్చింది" అని మోదీ చెప్పారు.

## బాబోయ్ సంక్రాంతి.. బస్ టికెట్ ధర రూ.5 వేలకు పైమాటే

రూ.15 వేల నుంచి 20,000 చెల్లించాల్సి వస్తుంది. ఏపీలోని విజయవాడ, గుంటూరు తిరుపతి, పాలకొల్లు, విశాఖపట్నం, భీమవరం, నర్సాపురం, రాజమండ్రి వెళ్లేందుకు ఒక్కో టికెట్‌పై రెండు నుంచి మూడు వేలు పెరగడంపై ప్రయాణికులు లబోదిబోమంటున్నారు. గతంలో రూ.1000 రూపాయలు, రూ.1200 ఉన్న టికెట్ తాజాగా రూ.3000 పైమాటే ఉంది. భీమవరం వెళ్లే ప్రయాణికుల నుంచి రూ. 3000 నుంచి రూ.4000, రాజమండ్రికి రూ. 3500 నుంచి రూ.4000 చెల్లించాల్సి వస్తుంది. ఇందేంటని ప్రశ్నిస్తే.. పండగ వేళ అంతే ఉంటాయి అని ప్రైవేట్ ట్రావెల్స్ బుకాయింపుపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## మరిన్ని పిచ్చి కేసులతో వేధిస్తారు: బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్

సమాధానాలు, సమర్పించిన పత్రాలు.. తదితర అంశాలను ఈ సమావేశంలో కేటీఆర్ వివరించారు. ఇదిలా ఉండగా, 'రాబోయే రోజుల్లో ఇలాంటి మరిన్ని పిచ్చి కేసులతో పార్టీ నేతలను ప్రభుత్వం వేధిస్తుంది. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల ఆత్మస్థైర్యం దెబ్బతీయాలని రేవంత్ పిచ్చి ప్రయత్నాలు చేస్తున్నారు. ఏదో ఒక గందరగోళం సృష్టించి స్థానిక సంస్థల గండం నుంచి బయట పడేందుకు ఇలాంటి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రభుత్వం ఎన్ని రకాలుగా ఇబ్బందులు పెట్టినా జనంతో ఉంటే వారే గుండెల్లో పెట్టుకుని చూసుకుంటారు'అని కేసీఆర్ వ్యాఖ్యానించినట్లు సమాచారం.

**ఏడాదిలోనే కాంగ్రెస్ తేలిపోయింది**

'అధికారంలోకి వచ్చిన ఏడాది లోపే కాంగ్రెస్ ప్రభుత్వం తేలిపోయింది. ఉన్న పథకాలు అమలు చేయలేక, కొత్త పథకాలు తెచ్చే తెలివిలేక ప్రభుత్వం చేతులెత్తేసింది'అని కేసీఆర్ అన్నట్లు తెలిసింది. ఎన్నికల హామీలేవీ అమలు చేసే పరిస్థితి లేదని ప్రజలకు అర్థమైందని, గతంలో మనం చేసిన మంచితో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న చెడును కూడా ప్రజలకు వివరించాల్సిన బాధ్యత బీఆర్ఎస్‌పై ఉందని ఆయన అన్నట్లు సమాచారం. 'స్థానిక సంస్థల ఎన్నికల్లో సరైన రీతిలో పనిచేస్తే ఫలితాలు మనకే అనుకూలంగా ఉంటాయి. పండుగ తర్వాత దృష్టి అంతా పార్టీ నిర్మాణం, బలోపేతంపైనే ఉంటుంది'అని కేసీఆర్ పేర్కొన్నారు.

## బెనిఫిట్ షోలు రద్దంటూ.. ప్రత్యేక షోలకు పర్మిషన్లు ఎందుకు?: తెలంగాణ హైకోర్టు




హైదరాబాద్ : తెలంగాణలో సినిమా టికెట్ల ధరలు, ప్రత్యేక ప్రదర్శనలపై దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు ఇవాళ విచారణ జరిపింది. ఈ సందర్భంగా.. ప్రత్యేక ప్రదర్శనలకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వడంపై న్యాయస్థానం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. రామ్ చరణ్ నటించిన 'గేమ్ చేంజర్' సినిమాకు టికెట్ల ధరల పెంపు, ప్రత్యేక ప్రదర్శనలపై శుక్రవారం తెలంగాణ హైకోర్టు లో విచారణ జరిగింది. తాజా పరిణామాల దృష్ట్యా బెనిఫిట్ షోలు రద్దు చేశామంటూ, పరోక్షంగా ప్రత్యేక షోలకు అనుమతి ఇవ్వడమేంటని తెలంగాణ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. అలాగే.. అర్ధరాత్రి ఒంటి గంట దాటిన తర్వాత తెల్లవారుజామున షోలకు అనుమతి ఇవ్వడంపై పునఃసమీక్షించాలని హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. "ప్రేక్షకుల భద్రతను దృష్టిలో ఉంచుకుని బెనిఫిట్ , ప్రత్యేక షోలకు అనుమతించొద్దు. నిర్మాత భారీ బడ్జెట్‌తో సినిమాలు తీసి ప్రేక్షకుల నుంచి వసూలు చేసుకోవడం సరైంది కాదు" అని కోర్టు ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది. ఈ విషయంపై తదుపరి విచారణను ఈనెల 24వ తేదీకి వాయిదా వేసింది.

# శ్రీ బాలాజీ రామకృష్ణ దేవాలయంలో నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం

## మునుగోడు శాసనసభ్యులు కోమటి రెడ్డి రాజగోపాల్‌రెడ్డి





వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి జనవరి 10 : చౌటుప్పల్ పట్టణంలోని వలిగొండ రోడ్డులో కొలువైన శ్రీ పద్మావతి అలివేలు మంగ సమేత శ్రీ బాలాజీ రామకృష్ణ దేవాలయంనికి వచ్చిన సందర్భంగా పూర్ణ కుంభంతో మంగళ వాయిద్యాలతో వేద పండితులతో ఘన స్వాగతం పలకడం జరిగింది.తదంతరం శ్రీ బాలాజీ రామకృష్ణ దేవాలయంలో వైకుంఠవైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని ఉత్తర ద్వారం ద్వారా దర్శించుకున్న మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ గోపాల్ రెడ్డి సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది.అనంతరం కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలందరు సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో చల్లగా ఉండాలని వెంకటేశ్వర స్వామిని మనసారా కోరుకుంటున్నానని అన్నారు. శ్రీ బాలాజీ రామకృష్ణ దేవాలయం నూతన కమిటీ అధ్యక్షుడుగా నాగిళ్ల రామచంద్రం, ప్రధాన కార్యదర్శి ఉదరి శంకర్, సంస్కృతిక కార్యదర్శి ఎలకరాజు మల్లేష్,ఉపాధ్యక్షుడు చింతల ప్రభాకర్ రెడ్డి, ఉదరి శ్యామ్, ఉష్కావుల శ్రీనివాస్, కోశాధికారిగా కానుగు శేఖర్ ముదిరాజ్,సహాయ కార్యదర్శి తూర్పునూరి మల్లేష్ గౌడ్,ప్రచార కార్యదర్శి తూర్పునూరు నరసింహ,ఆరుట్ల లింగస్వామి, సంస్కృతిక కార్యదర్శి గట్టు పవన్, అనంతుల నరసింహ, నకరకంటి శ్రీశైలం,శివగోని మహేష్, చామకూర రాజయ్య, బడుగు పద్మ, ఉయ్యాల పల్లవి, గౌరవ సలహాదారులు చింతల దామోదర్ రెడ్డి, చిక్క నరసింహ,నాంపల్లి శ్రీనివాస్, బాల్యం వెంకటా చలపతి, దాచేపల్లి రాజు, ధర్మకర్త మండలి బత్తుల శ్రీశైలం,బోయ రామచంద్రం, బడుగు మాణిక్యం, పాలడుగు వెంకన్న, గుజ్జల సురేందర్ రెడ్డి, దేవాలయ కమిటీ పాలకవర్గాన్ని మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేతుల మీదుగా ప్రమాణ స్వీకరం చేయడం జరిగింది. తనంతరం నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు, పబ్బు రాజు గౌడ్, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, పట్టణ నాయకులు, పంతులు బ్రహ్మశ్రీ సంతోష్ కుమార్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు...

# ముక్కోటి వైకుంఠ ఏకాదశి సందర్భంగా వివిధ ఆలయాల్లో పోటెత్తిన భక్తులు





మిర్యాలగూడ జనవరి 10:- (వార్తమిర్రర్) : ముక్కోటి వైకుంఠ ఏకాదశి సందర్భంగా శుక్రవారం పట్టణంలోని వివిధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక హౌసింగ్ బోర్డు శ్రీ వేంకేశ్వరస్వామి దేవాలయం, గీతా మందిర్ లో ప్రత్యేక పూజలు మిర్యాలగూడ శాసన సభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్, సతీమణి మాధవి నిర్వహించి మాట్లాడుతూ మిర్యాలగూడ నియోజకవర్గ ప్రజలందరు ఆయురారోగ్యాలతో ఉండాలంటూ కోరుతూ ప్రజలకు, బిఎల్ఆర్ బ్రదర్స్ కి ముక్కోటి వైకుంఠ ఏకాదశి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, బిఎల్ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు. మిర్యాలగూడ మండలంలోని అనంతపురం గ్రామంలో గుట్ట మీద కొలువై ఉన్న శ్రీదేవి భూదేవి సమేత కళ్యాణం వెంకటేశ్వర స్వామి దేవస్థానం, సరస్వతి అమ్మవారి దేవస్థానంలో వైకుంఠ ఏకాదశి ఉత్తరధార దర్శనానికి ప్రజలు చుట్టుపక్కల గ్రామాల నుంచి భారీ సంఖ్యలో స్వామివారిని అమ్మవారిని దర్శించుకున్నారు ఈ కార్యక్రమాలన్నింటికీ తెల్లవారుజాము 4 గంటల నుంచి ఆలయ ధర్మకర్త డాక్టర్ టి.శరత్ బాబు ఆధ్వర్యంలో ఏర్పాటుచేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. సరస్వతి దేవాలయంలో అక్షరాభ్యాసాలు విశేషంగా జరిగినాయి. కార్యక్రమాలలో మిర్యాలగూడ తహసిల్దార్ ఎన్.హరిబాబు, ఎంపిడిఓ ఎం.శేషగిరిశర్మ, గ్రామ కార్యదర్శి గాయత్రిరెడ్డి బొప్పన రామకోటేశ్వరరావు ఈఓ కాటూరి రామచంద్రప్రసాద్, జయశంకర్, రామ్మూర్తి, శ్రీనివాస్, వెంకయ్య అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయం ఈదులగూడలో ముక్కోటి ఏకాదశి వేడుకలను ఈదులగూడ పరిసర ప్రాంత ప్రజలు తెల్లవారు జామున భక్తి శ్రద్ధలతో ఎంతో వైభవంగా గోదారంగనాద స్వాములను 5, 4 వార్డుల కౌన్సిలర్లు ముదిరెడ్డి నర్సిరెడ్డి, చల్లా నాగమ్మ వెంకన్న పూజించారు.మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయ సింహారెడ్డి సతీసమేతంగా వెళ్ళి హౌసింగ్ బోర్డు శ్రీ వేంకేశ్వరస్వామికి దేవాలయం, గీతా మందిర్ లో ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడుతూ మిర్యాలగూడ నియోజకవర్గ ప్రజలందరు ఆయురారోగ్యాలతో ఉండాలంటూ కోరుతూ ప్రజలకు ఏకాదశి శుభాకాంక్షలు తెలిపారు.

# మాలలను ఎదుర్కోలేకనే మందకృష్ణ లక్ష డప్పులు వేల గొంతుల కార్యక్రమం: డాక్టర్ పిడమర్తి రవి



సికింద్రాబాద్, వార్త మిర్రర్ జనవరి 10 ....మాలలను ఎదుర్కొనే శక్తి లేకనే మందకృష్ణ మాదిగ లక్ష డప్పులు వేలగుంతుల కార్యక్రమం చేపట్టారని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ సెమినార్ హాల్లో నిర్వహించిన విద్యార్థి యువగర్జన సభ సన్నాక సమావేశం తాళ్ల అజయ్, బోరెల్లి సురేష్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ పిడమర్తి రవి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో వర్గీకరణ చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సుముఖంగా ఉన్నారని అలాంటి ముఖ్యమంత్రిని బిజెపి మాయలో పడి విమర్శించడం మాదిగ సంఘాల నాయకులకు మందకృష్ణ మాదిగకు సమంజసం కాదన్నారు. వర్గీకరణ చేయని బిజెపి పాలిత రాష్ట్రాలలో ఒక్క స్టేట్మెంట్ కూడా ఇవ్వలేదని అన్నారు. వర్గీకరణ కోసం కార్యచరణ ప్రారంభించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మీద మందకృష్ణ మాదిగ బిజెపి మూసుకులో విషం కక్కుతున్నారని అన్నారు. మాలలకు మందకృష్ణ మాదిగ భయపడుతున్నాడని అన్నారు. వర్గీకరణ ఉద్యమం చేసిన మాదిగలు చాలామంది వృద్ధులుగా మారారని వారి సంక్షేమం కోసం ఏ ఒక్కరోజు మందకృష్ణ మాదిగ ప్రభుత్వంతో కలిసి వాదనలు వినిపించలేదన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ ఆవరణంలో ఫిబ్రవరి 2న మాదిగ విద్యార్థి యువజన ప్రజాసంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన మాదిగ విద్యార్థి యువగర్జన సభను జయప్రదం చేయాలని అన్నారు. మాదిగ వర్గీకరణ ఉద్యమంలో విద్యార్థులు భాగస్వామ్యం కావడం ఎంతైనా అవసరమని అన్నారు.ఈ కార్యక్రమంలో పాల్వాయి నగేష్ మాదిగ, నవనిర్మాణ సమితి రాష్ట్ర అధ్యక్షులు, డాక్టర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మల్లేశం, ప్రొఫెసర్ డాక్టర్ మనోహర్, ప్రొఫెసర్ డాక్టర్ కొమ్ము కిరణ్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ నంద్రు నరసింహ, మాదిగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గడ్డ యాదయ్య,మాదిగ జెసి యూత్ కోఆర్డినేటర్ వడ్డె ఎల్లయ్య, మాదిగ విద్యార్థి చేసి రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ రామగల సుందర్, మాదిగ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు దర్శన్ జాన్,ఎమ్మార్పీఎస్ నాయకులు బోయిని ఎల్లేష్, స్పోర్ట్స్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు చాగంటి రాజేష్, నవీన్ రాజు, మాదిగ జేఏసీ యూత్ అధ్యక్షులు నక్క మహేష్,బోర్ర సురేష్, డాక్టర్ సుమన్, కొత్తపల్లి కృష్ణ, బీఎస్ఎఫ్ నాయకులు కల్వకుర్తి శ్రీశైలం, ఆరె కంటి శ్రీకాంత్, జోగు గణేష్,గండి శ్రీనివాస్, మీసాల మహేష్ తదితరులు పాల్గొన్నారు.



### సంస్థాన్ మండల బిజెపి అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగిడి మనోహర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన సుర్వి రాజుగౌడ్

యాదాద్రి వార్త మిర్రర్ (ప్రతినిధి గణేష్ సాగర్) : భారతీయ జనతా పార్టీ సంస్థాన్ నారాయణపురం మండల అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు డా, గంగిడి మనోహర్ రెడ్డి గారిని మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు, మరియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లును కూడా మర్యాదపూర్వకంగా కలిశారు, నారాయణపూర్ బిజెపి మండల శాఖ అధ్యక్షులు సుర్వి రాజు గౌడ్ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బచ్చనబోయిన దేవేందర్ యాదవ్, మండల ఉపాధ్యక్షులు సుధాకర్ రెడ్డి, వావిల్లపల్లి సీనియర్ నాయకులు రాజు యాదవ్ పాల్గొన్నారు


### మాలలను ఎదుర్కోలేకనే మందకృష్ణ లక్ష డప్పులు వేల గొంతుల కార్యక్రమం: డాక్టర్ పిడమర్తి రవి



సికింద్రాబాద్, వార్త మిర్రర్ జనవరి 10 ....మాలలను ఎదుర్కొనే శక్తి లేకనే మందకృష్ణ మాదిగ లక్ష డప్పులు వేలగుంతుల కార్యక్రమం చేపట్టారని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ సెమినార్ హాల్లో నిర్వహించిన విద్యార్థి యువగర్జన సభ సన్నాక సమావేశం తాళ్ల అజయ్, బోరెల్లి సురేష్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ పిడమర్తి రవి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో వర్గీకరణ చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సుముఖంగా ఉన్నారని అలాంటి ముఖ్యమంత్రిని బిజెపి మాయలో పడి విమర్శించడం మాదిగ సంఘాల నాయకులకు మందకృష్ణ మాదిగకు సమంజసం కాదన్నారు. వర్గీకరణ చేయని బిజెపి పాలిత రాష్ట్రాలలో ఒక్క స్టేట్మెంట్ కూడా ఇవ్వలేదని అన్నారు. వర్గీకరణ కోసం కార్యచరణ ప్రారంభించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మీద మందకృష్ణ మాదిగ బిజెపి మూసుకులో విషం కక్కుతున్నారని అన్నారు. మాలలకు మందకృష్ణ మాదిగ భయపడుతున్నాడని అన్నారు. వర్గీకరణ ఉద్యమం చేసిన మాదిగలు చాలామంది వృద్ధులుగా మారారని వారి సంక్షేమం కోసం ఏ ఒక్కరోజు మందకృష్ణ మాదిగ ప్రభుత్వంతో కలిసి వాదనలు వినిపించలేదన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ ఆవరణంలో ఫిబ్రవరి 2న మాదిగ విద్యార్థి యువజన ప్రజాసంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన మాదిగ విద్యార్థి యువగర్జన సభను జయప్రదం చేయాలని అన్నారు. మాదిగ వర్గీకరణ ఉద్యమంలో విద్యార్థులు భాగస్వామ్యం కావడం ఎంతైనా అవసరమని అన్నారు.ఈ కార్యక్రమంలో పాల్వాయి నగేష్ మాదిగ, నవనిర్మాణ సమితి రాష్ట్ర అధ్యక్షులు, డాక్టర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మల్లేశం, ప్రొఫెసర్ డాక్టర్ మనోహర్, ప్రొఫెసర్ డాక్టర్ కొమ్ము కిరణ్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ నంద్రు నరసింహ, మాదిగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గడ్డ యాదయ్య,మాదిగ జెసి యూత్ కోఆర్డినేటర్ వడ్డె ఎల్లయ్య, మాదిగ విద్యార్థి చేసి రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ రామగల సుందర్, మాదిగ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు దర్శన్ జాన్,ఎమ్మార్పీఎస్ నాయకులు బోయిని ఎల్లేష్, స్పోర్ట్స్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు చాగంటి రాజేష్, నవీన్ రాజు, మాదిగ జేఏసీ యూత్ అధ్యక్షులు నక్క మహేష్,బోర్ర సురేష్, డాక్టర్ సుమన్, కొత్తపల్లి కృష్ణ, బీఎస్ఎఫ్ నాయకులు కల్వకుర్తి శ్రీశైలం, ఆరె కంటి శ్రీకాంత్, జోగు గణేష్,గండి శ్రీనివాస్, మీసాల మహేష్ తదితరులు పాల్గొన్నారు.




### యువతరానికి ఆదర్శంగా క్రికెట్ టోర్నమెంట్ లో పాల్గొన్న 1995 -96 విద్యార్థులు

సంస్థాన్ నారాయణపురం జనవరి 10 :( వార్త మిర్రర్) : నారాయణపూర్ మండల కేంద్రంలోని క్రీడలతో మానసిక ఉల్లాసానికి ఆరోగ్యవంతంగా ఉండేందుకు క్రీడల విశిష్టతను నేటి యువతరానికి సహకారం ఇస్తూ 25 సంవత్సరాల తర్వాత మట్టిలో మాణిక్యాన్ని వెలికి తీసే ప్రయత్నం చేస్తున్న స్నేహ యూత్ అన్ని రంగాలలో కంటే అతి ముఖ్యమైన రంగం క్రీడారంగం మనీ గుర్తించి 1995 – 96 గుర్తించి క్రీడారంగంలో పాల్గొన్నారు క్రీడలు మనిషికి పేరు ప్రఖ్యాతలు తెచ్చి సమాజంలో మంచి పౌరునిగా గుర్తిస్తాయి యువకులు మత్తు గుట్కా వంటి వ్యసనాలకు అలవాటు పడకుండా మంచి మార్గాన్ని ఎంచుకొని వారి యొక్క భవిష్యత్తును కాపాడుకోవాల్సిన బాధ్యత నేటి యువతరానిది విద్యార్థి విద్యార్థిని ప్రపంచాన్ని చాటించే విధంగా తనకున్నటువంటి సంకల్పంతో ముందుకు సాగాలి అప్పుడే మనిషి ఒక గుర్తింపు తో పాటు విలువను నిస్తుంది శ్రమించనిదే ఫలితం రాదు ఎంతటి త్యాగానికైనా సిద్ధమై విజయ సంకేతాన్ని ఎగరవేయాలి ఈ కార్యక్రమంలో స్నేహ యూత్ అధ్యక్షులు ఎండి అజహార్ రాపర్తి కరుణాకర్ ఉప్పల లింగస్వామి రాసాల యాదయ్య. భాస్కర్ జక్కిడి సుదర్శన్ రెడ్డి. పెదగొని వెంకటేష్ పేరా శేఖర్ లచ్చమ్మ గూడెం మల్లేష్ వార్త మిర్రర్ విలేకర్ చిలువేరు జంగయ్య. రేవనపల్లి యాదగిరి. వార్తా వేదిక సూర్య విలేకర్ ఆర్ బి రాములు ఉప్పల కృష్ణ గోశిక స్వామి తదితరులు క్రికెట్ టోర్నమెంట్ లో పాల్గొనడం జరిగింది



### జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం. ముగ్గురు మృతి

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జనవరి 10 : జగిత్యాల జిల్లా లోని తక్కళ్లపల్లి వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. 2 బైకులు ఎదురెదురుగా వచ్చి ఢీకొనగా ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. స్థానికుల సమాచారంతో ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృతుల్లో ఇద్దరు జగిత్యాల మండలం జాబితాపూర్ వాసులు అరవింద్, సాయి గా, మరొకరు మేడిపల్లి మండలం కొండాపూర్ వాసి వంశీ గా పోలీసులు గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



### శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్న వల్లారపు శ్రీనివాస్ కుమార్

సికింద్రాబాద్, వార్త మిర్రర్ జనవరి 10... వైకుంఠ ఏకాదశి పర్వ దినోత్సవాన్ని పుంస్కరించుకొని నామాలగుండులోని శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో వెంకటేశ్వర స్వామి వారిని సతీ సమేతంగా దర్శించుకొని ప్రత్యేక పూజలో సికింద్రాబాద్ తెదేపా నాయకుడు వల్లారపు శ్రీనివాస్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా సీతాఫల్మండి డివిజన్ అధ్యక్షుడు జి.వి కృష్ణ, ఆలయ సభ్యులు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



### ముక్కోటి ఏకాదశి శోభ.. భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జనవరి 10 : ముక్కోటి ఏకాదశి వేడుకలు జగిత్యాల జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుండి పలు వైష్ణవాలయాలకు భక్తులు భారీ ఎత్తున తరలివచ్చారు. ఆలయాలను తెరచి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు ఉత్తరద్వార దర్శనం కల్పించారు. ఈ రోజు విష్ణువును దర్శించుకుంటే వైకుంఠం ప్రాప్తిస్తుందని భక్తుల నమ్మకం. ముక్కోటి ఏకాదశి రోజు వెంకటేశ్వర స్వామిని ఉత్తర ద్వారం ద్వారా దర్శించుకుంటే ఎంతో పుణ్యఫలం లభిస్తుందని భక్తుల విశ్వాసం. ఈ సందర్భంగా అర్చకులు మురళి, పరమేశ్వర్ మాట్లాడుతూ ముక్కోటి ఏకాదశి సందర్భంగా తెల్లవారుజాము నుండి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామని తెలిపారు. స్వామి వారి పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు దర్శన అవకాసం కల్పించామని తెలుపారు. తెల్లవారుజాము నుండి పెద్ద ఎత్తున భక్తులు వచ్చి స్వామిని దర్శించుకున్నారని తెలిపారు. వైకుంఠ ఏకాదశి అనేది ఎంతో పుణ్యం అయిన రోజు అని అంటున్నారు. ధనుర్మాసంలోని ముక్కోటి ఏకాదశి రోజు ఎంతో పవిత్రమైన రోజు కావడంతో ఈ రోజుకే అధిక సంఖ్యలో భక్తులు వచ్చి దర్శించుకుంటారని అర్చకులు చెబుతున్నారు.

# తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ రౌండ్ టేబుల్ సమావేశం

దేవరకొండ జనవరి 10 వార్త మిర్రర్ : తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ( బికేఎంయు) దేవరకొండ మండల కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం కిన్నెర బారీములు అధ్యక్షతన నిర్వహించారు.ఈ సమావేశంలోతెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బొలుగురు నరసింహ పాల్గొని మాట్లాడుతూ భూమిలేని నిరుపేదలకు సంవత్సరానికి 12 వేల రూపాయలను ఇవ్వాలని ఏ విధమైన కోరీలు లేకుండా ఉపాధి హామీజాబ్ కార్డు ఉన్నవారికి సంవత్సరానికి 12,000 ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేశారు . ప్రభుత్వం పాసుబుక్కులో ఒక గుంట రెండు గుంటల పేరుతో కాకుండా జాబ్ కార్డు ఆధారంగా అందరికీ ఇవ్వాలని డిమాండ్ చేశారు ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రకారం రేషన్ కార్డులు వృద్ధాప్య , వితంతు ,ఒంటరి మహిళ లకు .వికలాంగులకు పెన్షన్ ఇవ్వాలి, నెలకు మహిళలకు 2500 రూపాయలు తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం దేవరకొండ నియోజకవర్గంఅధ్యక్ష కార్యదర్శులు మొగిలి వెంగళయ్య ఎలిమినేట్ హుస్సేను మాట్లాడుతూఉపాధి హామీ కూలీలకు 200రోజులు పని దినాలు కల్పించి రోజువారి వేతనం 600 ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లని అర్హులైన వారందరికీ ఇవ్వాలని డిమాండ్ చేశారు ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ అధ్యక్షులు వలమల్ల ఆంజనేయులు, రజక సంఘం దేవరకొండ



డివిజన్ కార్యదర్శి పగిళ్ల బుచ్చయ్య, గిరిజన సమైక్య దేవరకొండ నియోజకవర్గం అధ్యక్షులు దేవిల్లాల్,ప్రజా సంఘాల నాయకులు ఆర్ శంకర్ నాయక్, లాలయ్య దాసరి రాములు వాకూడవత్ బాబు వలమల్ల బక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

# వైకుంఠ ఏకాదశి వేడుకల్లో శ్రీ ఆది మహావిష్ణు ఆలయంలో భక్తుల సందడి

**ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి- లక్ష్మి కుటుంబ సమేతంగా స్వామివారికి ప్రత్యేక పూజలు**

**శ్రీశ్రీశ్రీ మహాలక్ష్మి సమేత శ్రీ ఆది మహావిష్ణువు స్వామివార్ల తిరుకళ్యాణం తిలకించిన భక్తజనం.!**






యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్) : యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం, దేవలమ్మ నాగారం గ్రామంలో వెలిసిన శ్రీ ఆది మహావిష్ణు ఆలయంలో వైకుంఠ ముక్కోటి ఏకాదశి శుక్రవారం రోజున, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మునుగోడు శాసనసభ్యు లు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి-లక్ష్మి దంపతులకు కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు, ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి-లక్ష్మీ దంపతులు స్వామివారి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తెల్లవారుజామున రెండు గంటల 30 నిమిషాల నుండి స్వామివార్లకు విశిష్ట మహాభిషేకం నిర్వహించారు, ఉదయం 6 గంటలకు భక్తులకు ఉత్తర ద్వారా దర్శనం కల్పించారు, మంగళ వాయిద్యాల, భక్తుల నామ సంకీర్తనల మధ్య శ్రీ ఆదిమహావిష్ణు అనుగ్రహముచే రాజగోపుర శిఖర శంకుస్థాపన మహోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా జరిపారు, అనంతరం రాజగోపుర శిఖరములకు మహా కుంభ అభిషేకం ఆరాధన ఆరగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు, మధ్యాహ్నం 12 గంటల నుండి శ్రీశ్రీశ్రీ మహాలక్ష్మి సమేత శ్రీ ఆది మహావిష్ణు స్వామి వార్ల తిరుకళ్యాణ మహోత్సవం అత్యంత అంగరంగ వైభవంగా జరిపించారు, ఈ కార్యక్రమానికి పలు జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# ఏబీవీపీ ఆధ్వర్యంలో ఘనంగా స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలు

దేవరకొండ జనవరి 10 వార్త మిర్రర్ : అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నల్గొండ జిల్లా దేవరకొండ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలు, డ్రగ్ ఫ్రీ తెలంగాణ నినాదంతో ర్యాలీ నిర్వహించడం జరిగింది. అనంతరం స్వామి వివేకానంద జయంతి సందర్భంగా దేవరకొండ శాఖ ఆధ్వర్యంలో డ్రగ్ ఫ్రీ తెలంగాణ నినాదంతో నిర్వహించిన ర్యాలీ కార్యక్రమంలో ముఖ్య వక్త తటిశెట్టి సుదర్శన్ మాట్లాడుతూ స్వామి వివేకానంద ఈ దేశ యువతకి ఆదర్శమని ఏబీవీపీ గత 75 సంవత్సరాలుగా స్వామి వివేకానంద చూపిన బాటలో నడుస్తుందని అన్నారు. ప్రపంచ దేశాలు భారత దేశ సంస్కృతిని చూసి నవ్వుకుంటున్న తరుణంలో భారత దేశ సంస్కృతి సంప్రదాయాలను విశిష్టతను ప్రపంచ దేశాలకు చాటి చెప్పిన మహోన్నతమైన వ్యక్తి స్వామి వివేకానంద అని అన్నారు ముఖ్య అతిథిగా విచ్చేసిన స్టేట్ యూనివర్సిటీస్ కో-కన్వీనర్ మానేశ్వర్ చారి మాట్లాడుతూ స్వామి వివేకానంద గారి గొప్ప వ్యక్తి యొక్క జయంతిని పురస్కరించుకొని ఏబీవీపీ దేవరకొండ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "డ్రగ్ ఫ్రీ తెలంగాణ" కార్యక్రమాన్ని అభినందిస్తూ నేటి యువత గంజాయికి డ్రగ్స్ కి అలవాటు పడి తమ యొక్క జీవితాన్ని కుటుంబాన్ని రోడ్డున పడేస్తున్నారు అని ఆవేదన వ్యక్తం చేశారు చేడు దారిన పోకుండా స్వామి వివేకానంద ను ఆదర్శంగా తీసుకుని ఈ దేశ యువత ఈ దేశం యొక్క భవిష్యత్తు, సంపద మన యొక్క శక్తిని ఈ దేశాన్ని ప్రపంచంలో విశ్వ గురువుగా మలచడంలో ఉండాలని ఆశించారు.ఈ కార్యక్రమంలోరాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంకురి శ్రీకాంత్, విభాగ్ హాస్టల్స్ కన్వీనర్ యలమల గోపీచంద్, నగర సంయుక్త కార్యదర్శి సంతోష్, నగర హాస్టల్స్ కన్వీనర్ తులసిరం,నగర గర్ల్స్ కన్వీనర్ కావ్య పవిత్ర ,హేమసుందర్, శంకర్,తదితరులు పాల్గొన్నారు.








# శ్రీ బాలాజీ రామకృష్ణ దేవాలయంలో నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం

## ::: మునుగోడు శాసనసభ్యులు కోమటి రాజగోపాల్ రెడ్డి

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి జనవరి 10 : చౌటుప్పల్ పట్టణంలోని వలిగొండ రోడ్డులో కొలువైన శ్రీ పద్మావతి అలివేలు మంగ సమేత శ్రీ బాలాజీ రామకృష్ణ దేవాలయం నికి వచ్చిన సందర్భంగా పూర్ణ కుంభంతో మంగళ వాయిద్యాలతో వేద పండితులతో ఘన స్వాగతం పలకడం జరిగింది.తదంతరం శ్రీ బాలాజీ రామకృష్ణ దేవాలయంలో వైకుంఠవైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని ఉత్తర ద్వారం ద్వారా దర్శించుకున్న మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ గోపాల్ రెడ్డి సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది.అనంతరం కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలందరు సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో చల్లగా ఉండాలని వెంకటేశ్వర స్వామిని మనసారా కోరుకుంటున్నానని అన్నారు. శ్రీ బాలాజీ రామకృష్ణ దేవాలయం నూతన కమిటీ అధ్యక్షుడుగా నాగిళ్ల రామచంద్రం, ప్రధాన కార్యదర్శి ఉదరి శంకర్, సంస్కృతిక కార్యదర్శి ఎలకరాజు మల్లేష్,ఉపాధ్యక్షుడు చింతల ప్రభాకర్ రెడ్డి, ఉదరి శ్యామ్, ఉష్కావుల శ్రీనివాస్, కోశాధికారిగా కానుగు శేఖర్ ముదిరాజ్,సహాయ కార్యదర్శి తూర్పునూరి మల్లేష్ గౌడ్,ప్రచార కార్యదర్శి తూర్పునూరు నరసింహ,అరుట్ల లింగస్వామి, సంస్కృతిక కార్యదర్శి గట్టు పవన్, అనంతుల నరసింహ, నకరకంటి శ్రీశైలం,శివగోని మహేష్, చామకూర రాజయ్య, బడుగు పద్మ, ఉయ్యాల పల్లవి, గౌరవ సలహాదారులు చింతల దామోదర్ రెడ్డి, చిక్క నరసింహ,నాంపల్లి శ్రీనివాస్, బాల్యం వెంకటా చలపతి, దాచేపల్లి రాజు, ధర్మకర్త మండలి బత్తుల శ్రీశైలం,బోయ రామచంద్రం, బడుగు మాణిక్యం, పాలడుగు వెంకన్న, గుజ్జల సురేందర్ రెడ్డి, దేవాలయ కమిటీ పాలకవర్గాన్ని మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేతుల మీదుగా ప్రమాణ స్వీకరం చేయడం జరిగింది. తనంతరం నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు, పబ్బు రాజు గౌడ్, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, పట్టణ నాయకులు, పంతులు బ్రహ్మశ్రీ సంతోష్ కుమార్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు...



# ముస్లిం మైనారిటీల సమస్యలు పరిష్కరిస్తా

## ::: దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్

దేవరకొండ జనవరి 10 వార్త మిర్రర్ : దేవరకొండ పట్టణంలో ముస్లిం మైనారిటీ సోదరులు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తానని ఎమ్మెల్యే బాలు నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం నాడు స్థానికంగా జరిగిన ముస్లిం మైనారిటీలు మత పెద్దలతో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ దేవరకొండ లో ప్రధానంగా ఈద్గా, ఖబ్రస్తాన్ మరియు ఉర్దూ మీడియం, మదర్సలో ఉన్న పలు పనులను త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. కొత్త షాది ఖానా, కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపడతామన్నారు. అదేవిధంగా ఉర్దూ ఇంటర్ కళాశాల మరియు ముస్లింల మృతదేహాలకు తీసుకెళ్లే (అంతిమ వాహనం) వచ్చే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు, ముస్లిం మైనారిటీల సంక్షేమానికి ఈ ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి ఎమ్ ఏ సిరాజ్ ఖాన్, మహ్మద్ ఆబిద్ అలీ, ఖాజా ఖైరత్ (సలీమ్), మహ్మద్ ఇలియాస్ పటెల్, మహ్మద్ ఖదీర్ (సాలర్), డైరెక్టర్ సయ్యద్ దస్తగిర్, మహ్మద్ షబ్బీర్, మహ్మద్ సలీమ్, ఖాజా మైనోద్దీన్, ఎస్ కె బురాన్, మహ్మద్ ముజీబ్, మహ్మద్ ఫయాజ్,సయ్యద్ మొయిన్ పాషా , మహ్మద్ అతీఖ్,మొహమ్మద్ ఇక్రం, మహ్మద్ షఫీ, మహ్మద్ ఇస్మాయిల్, మహ్మద్ ఫైజాన్. మహ్మద్ బాబా, తదితరులు పాల్గొన్నారు.




# ఎన్‌హెచ్‌ఆర్‌సి నల్గొండ జిల్లా కమిటీ అధ్యక్షురాలుగా నిర్మలాదేవి

## జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఊరుగొండ శ్రీనివాసులు నియామకం

దేవరకొండ జనవరి 10 వార్త మిర్రర్ : జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్ హెచ్ ఆర్ సి) రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మొగుళ్ళ భద్రయ్య సార్ ఆదేశాల మేరకు నల్గొండ జిల్లా కమిటీ అధ్యక్షురాలుగా మిర్యాలగూడకు చెందిన సామాజిక ఉద్యమ కారురాలు , తరంగాలు పత్రిక ఎడిటర్ శ్రీమతి పేరపాక నిర్మలాదేవి, జిల్లా ప్రధాన కా ర్యదర్శిగా దేవరకొండకు చెందిన ఊరుగొండ శ్రీనివాసులు లను నియమస్తూ ఉత్త ర్వులను అందజేసినట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోట రాజయ్య, పాముల నారా యణలు తెలిపారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటూ పేద ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా బలమైన లీగల్ ప్రొసీజర్ తో ముందుకు పోతున్న జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్ హెచ్ ఆర్ సి) ని జిల్లా వ్యాప్తంగా బలోపేతం చేయాలని వారు ఆదేశించారు. ఈ సందర్భంగా నూతనంగా నియామకమైన ఎన్ హెచ్ ఆర్ సి నల్గొండ జిల్లా అధ్యక్షురాలు పేరపాక నిర్మలాదేవి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఊరుగొండ శ్రీనివాసులు మాట్లాడుతూ తమకు ఇచ్చిన ఈ బాధ్యతలను నీతి, నిజాయితీతో నిర్వహిస్తామని, పేద ప్రజల సమస్యలు పరిష్కారం కోసం కృషి చేస్తామని, రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు సంస్థ బలోపేతం కోసం పనిచేస్తామని అన్నారు. నల్గొండ జిల్లాలోని అన్ని మండల కమిటీల నిర్మాణం పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. తమ ని యామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మొగుళ్ళ భద్రయ్య సార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సుంకనపల్లి రాము, మీదింటి శివ వీర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు తోట రాజయ్య, పాముల నారాయణ, రాష్ట్ర కార్యదర్శి గూడూరు మాంచాలక్క, బొమ్మిడాల ము రళిలకు కృతజ్ఞతలు తెలిపారు. వీరి ఇరువురి నియామకంతో నల్గొండ జిల్లా వ్యాప్తంగా సామాజిక ఉద్యమకారులు, మేధావులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# హైదరాబాద్‌లో ఈనెల 19న జరిగే మాదిగల మహా గర్జన

## మాదిగల మహా గర్జన వేలాదిగాతరలిరావాలి

## ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎల్లేష్ మాదిగ

దేవరకొండ జనవరి 10 వార్త మిర్రర్ : మాదిగ,మాదిగ ఉపకులాల, ఏబిసిడి వర్గీకరణ పోరాటాల కోసం హైదరాబాదులో జరిగే మాదిగల మహా గర్జనకు కదలి రావాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎల్లేష్ మాదిగ అన్నారు. నల్గొండ జిల్లా దేవరకొండ పట్టణంలో ఐబి కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎమ్మార్పీఎస్ మహా గర్జన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 సంవత్సరాల సుదీర్ఘ పోరాటంలో మాదిగ మాదిగ ఉపకులాల ఏబిసిడి చట్టబద్ధమైన,డిమాండ్ అని అత్యుత్తమైన న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అభినందనీయమని, అదేవిధంగా ఆ రోజున శాసనసభలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏబిసిడి వర్గీకరణకు పూర్తి మద్దతు ఇస్తున్నామని అన్నారు వర్గీకరణ అమలు కాకముందే ఉద్యోగ నియామకాలు చేయకూడదని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు అర్హులైన నిరుపేదలకు ఇందిర ఇండ్లుఇచ్చే విధంగా చూడాలని అసైన్డ్ భూములను రెగ్యులరైజ్ చేసి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో డప్పు చెప్పు వృత్తిదారులకు, 4000/-రూపాయల పెన్షన్ ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ మహా గర్జనకు గ్రామ గ్రామం నుండి మాదిగలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జాతీయ నాయకులు కంబాలపల్లి వెంకటయ్య, దేవరకొండ నియోజకవర్గం ఇంచార్జ్ పోతే సహదేవుడు,దేవరకొండ కన్వీనర్ ఎర్ర యాదగిరి ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఏసన్న మాదిగ ఎర్ర ఆంజనేయులు,ఎమ్మార్పీఎస్ నాయకులు సీతయ్య సంజీవ ప్రభు వంశి వెంకటయ్య లక్ష్మయ్య ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

# చైనా మాంజా అమ్మితే కఠిన చర్యలు

## షాపులలో తనిఖీలు చేపట్టిన ఆటవి శాఖ అధికారులు



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జనవరి 10 : సంక్రాంతి పండుగ వేళ గాలిపటాలు ఎగరేసి చిన్నా, పెద్దా తేడా లేకుండా కేరింతలు కొట్టడం ఆనవాయితీగా వస్తోంది. ఎదుటి వారి గాలిపటాలను తెగ్గొట్టాలన్న తాపత్రయంతో ప్రమాదకర చైనా మాంజాను వాడుతున్నారు. అత్యంత పదునుగా, బలంగా ఉండే చైనా మాంజా మనుషులకే కాదు, జంతువులు, పక్షులకు సైతం ముప్పు తెస్తోంది. చైనా మాంజాతో ప్రమాదాలు జరుగుతున్నాయని 2016 ప్రభుత్వం విక్రయాలను నిషేధించింది. గాలిపటాల పోటీలో తెగిపడిన దారాలు చెట్ల కొమ్మలు, విద్యుత్తు తీగలకు, భవనాలపై పడుతున్నాయి. వాహనాలపై వేగంగా వెళ్తున్నవారికి మాంజా తగిలి గాయపడుతున్నారు. సన్నగా, దృఢంగా ఉండే ఈ దారాన్ని చేతులతో, పళ్లతో తెంచే ప్రయత్నం చేస్తే ప్రమాదమే. అలాగే చైనా మాంజా వల్ల పక్షులకు మానవులకు ప్రమాదం పోచి ఉన్న కారణంగా జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణం లోని పలు షాపులో ఆటవి శాఖ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ పద్మ, బీట్ ఆఫీసర్లు రమణారెడ్డి, సంధ్య, కవిత, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# జాతీయస్థాయి కరాటే పోటీలలో పథకం సాధించిన దండికే వికాస్

## ఘనంగా సన్మానించిన జిల్లా యాదవ సంఘ నాయకులు



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జనవరి 10 : జాతీయ స్థాయి కరాటే పోటీలలో భాగంగా ముంబై లో జరిగిన 12 సంవత్సరాల విభాగంలో జాతీయ స్థాయి లో తృతీయ (మూడవ) స్థానంలో నిలిచిన సిల్వర్ మేడల్ సాధించిన దండికే వికాస్ యాదవ్ ని జగిత్యాల జిల్లా రాయకల్ పట్టణ కేంద్రంలో యాదవ సంఘ సభ్యులు సాలువతో సత్కరించి మేడల్ అందించి ఘనంగా సన్మానించారు..ఈ సందర్బంగా యాదవ సంఘం అడహాక్ కమిటీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు గన్నవేని మల్లేష్ యాదవ్ , జిల్లా ముఖ్య సలహాదారుడు రెబ్బాస్ మల్లయ్య యాదవ్, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మాజీ సర్పంచ్ వాసరి రవి యాదవ్ లు మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం మండల కేంద్రానికి చెందిన దండికే వికాస్ యాదవ్ జాతీయ స్థాయి కరాటే పోటీలలో తన ప్రతిభను చాటుకుని సిల్వర్ మెడల్ సాధించడం అభినందనీయమని అన్నారు. భవిష్యత్ లో మరిన్ని పథకాలు సాధిస్తూ, ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు..ఈ కార్యక్రమంలో యాదవ సంఘం అడహాక్ కమిటీ రాయికల్ పట్టణ ఇంచార్జి గంగవేని కొమురయ్య యాదవ్, బొడ్డు పోచమల్లు యాదవ్, మల్లేశం యాదవ్, మధు యాదవ్, రాజు యాదవ్, దనరేకుల మహేందర్ యాదవ్, రాజ్ కుమార్ యాదవ్, దానవేణి రాము యాదవ్, మర్రి మల్లేష్ యాదవ్, మ్యాకల రాజేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు..

# కిష్టంపేట పాఠశాలలో వేడుకగా ముందస్తు సంక్రాంతి సంబరాలు

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జనవరి 10 జగిత్యాల జిల్లా రాయికల్ మండలం కిష్టంపేట మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల లో ముందస్తు సంక్రాంతి సంబరాలను శుక్రవారం వేడుకగా నిర్వహించారు. ఇందులో భాగంగా పాఠశాల లో విద్యార్థులతో బోగి మంటలు, రంగ వల్లులు వేసి వేడుకలు జరుపుకున్నారు. ఈ వేడుకలను ప్రధానోపాధ్యాయులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్ తరాల వారికి మన సాంప్రదాయాలు, కట్టుబాటులు, పండుగలు గుర్తుఉండేలా నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా హరిదాస్ వేశాధారణలు , బాలికలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులు వేసిన రంగవల్లులను పరిశీలించి ఉత్తమ ముగ్గులను ఎంపిక చేసి వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమం లో ప్రధానోపాధ్యాయులు జె.తిరుమల రావు, ఉపాధ్యాయులు శ్రీలత, రాజమణి, చంద్రశేఖర్ , జయదేవ్ వర్మ, సహాయకురాలు పాల్గొన్నారు.





# తల్లి ప్రేమను చాటుకున్న శునకం

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జనవరి 10 : జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణ కేంద్రంలోని హరిదాసు కిరాణం సమీపంలో రోడ్డుపై ఒక కుక్కపిల్లను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టగా, అది అక్కడికక్కడే మృతి చెందింది. తల్లి కుక్క తన మృత పిల్ల పక్కన దీనంగా కూర్చుని ఉండడం, ఎవరిని తన దగ్గరికి రానీయకుండా ఉండడం చూసి చాలామంది మాతృ ప్రేమను చాటుకున్న శునకాన్ని చూసి, అందరూ ఆశ్చర్యపడ్డారు. ఈ సంఘటన తల్లి ప్రేమకు జంతువులు కూడా అతీతం కాదని, వారి మాతృస్నేహం మనసులను హత్తుకుంటుందని సూచిస్తున్నాయి.

# ఆర్టీసీ డ్రైవర్ పై దాడి చేసిన నిందితుడి అరెస్టు



మిర్యాలగూడ , జనవరి 10:-(వార్తమిర్రర్) : ఆర్టీసీ బస్సు డ్రైవర్ పై దాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్టు టూ టౌన్ సిఐ పి.నాగార్జున శుక్రవారం విలేఖర్లకు తెలిపారు. గత డిసెంబర్ 18న మిర్యాలగూడ ఆర్టీసీ బస్ స్టేషన్ లో హైదరాబాదు- మిర్యాలగూడ ఆర్టీసీ బస్సు స్టేషన్ ప్లాట్ ఫాం-3 మీద కు బస్సు డ్రైవర్ గండికోట శ్రీనివాస్ ప్రయాణీకులను తీసుకెల్లెందుకు బస్సు తీసుకువస్తుండగా ప్లాట్ ఫాం మీద నూనావత్ అఖిల్ తన బైక్ ని అడ్డంగా పెట్టగా, సదరు బస్ డ్రైవర్ ప్రక్కకు తీయమన్నందుకు డ్రైవర్ ను దుర్భాషలడుతూ విధులకు ఆటంకం కలిగించి దాడి చేసి తీవ్రంగా గాయ పరచిన నునావత్ అఖిల్ ను శుక్రవారం మిర్యాలగూడ టూ టౌన్ పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించారని టూ టౌన్ ఇన్స్పెక్టర్ నాగర్జున తెలిపారు. ఎస్ఐ రాంబాబు, పిసిలు లక్ష్మణ్, సమద్ లు రైటర్లు అక్బర్, రామకృష్ణ, నరేష్ సిబ్బంది పాల్గొన్నారు.






# ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు దాతలుగా సహకరిచడం అభినందనీయం

## ::: సబ్ కలెక్టర్ అమిత్

మిర్యాలగూడ , జనవరి 10:-(వార్తమిర్రర్) : ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులైన దాతల సంక్షేమ అభివృద్ధి పనులు చేయడం అభినందనీయమని స్థానిక సబ్ కలెక్టర్ ఎం.నారాయణ్ అమిత్ అన్నారు. దాతల సహకారంతో శుక్రవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు టై, బ్యాడ్జి, బెల్టుల పంపిణీ, పాఠశాలలో మిని గ్రీన్ గార్డెన్ సబ్ కలెక్టర్ అమిత్ ప్రారంభించి మొక్కలు నాటారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధర్మనాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అన్ని రకాల సదుపాయాన్ని కల్పిస్తుందన్నారు. దాతలు ముందుకొచ్చి పాఠశాలకు సహకరిస్తున్నందుకు వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతుందన్నారు విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకొని చదువుకోవాలని, పాఠశాల విద్య కీలకమైనదని ఐక్యతకోసం టై, బ్యాడ్జి, బెల్టులు అందించిన ప్రధానోపాధ్యాయునికి అభినందించారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నూకల వేణుగోపాల్రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులలో అన్ని రకాల అభివృద్ధి క్రమశిక్షణకు మారుపేరు అని అన్నారు. సహకరించిన దాతలు జి.బేబి రాణి రెండు మోటార్లు రూ.40,000లు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కె. కృష్ణకాంత్ నాయక్ గేట్ ఏర్పాటుకు, రూ.16,000లు టై, బ్యాడ్జీ, బెల్టులు కోసం సూర్య రామారావు డయోగ్నస్టిక్ కుర్ర కాంతి-కృష్ణ కాంత్ నాయక్, డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి ఆర్థో, సంయుక్తంగా రూ.45,000లు జిహెచ్ఎం కే.పరశురాములు, ఎస్ఎ ఎం.శారదబాయి, పిడి బి.జనార్దన్ రెడ్డి రూ.15000ల మైక్ బహూకరించారు.గుడపురి లక్ష్మణ్, కన్నెబోయిన వెంకటేశ్వర్లు వాకర్స్ అసోసియేషన్ ద్వారా 50 మొక్కలు జిగాంధీ వినాయక హాస్పిటల్ 5000 గార్డెన్ ఫెన్సింగ్, పాఠశాలలో నూతనంగా విధులలో చేరిన ఉపాధ్యాయులు జానయ్య, లక్ష్మయ్య, స్వామి, మీనా, జంగయ్య, భవాని మినరల్ ప్లాంట్ రిపేర్ కొరకు రూ.30,000లు బహుకరించారు. వారందరిని సబ్ కలెక్టర్ ఘనంగా సన్మానించిఅభినందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎన్.హరిబాబు, ఎంఈఓ ఎల్.బాలునాయక్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్ రెడ్డి, వార్డు కౌన్సిలర్లు ఎల్.రవినాయక్, ఎం.నర్సిరెడ్డి, ఏఎంసి చైర్మన్ భవాని, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కుర్ర కృష్ణకాంత్ నాయక్, ఉపాధ్యాయులు ఉపేందర్, ముంతాజ్ బేగం, థావుర్యా, సంతోష్, అనిత జ్యోతి, ధనలక్ష్మీ, అశ్విని, స్పందన, వెంకటరమణారెడ్డి, బెబి రాణి, వినోద, కాంతయ్య, కరుణాకర్, పద్మావతి, జానయ్య, లక్ష్మయ్య, జంగయ్య, స్వామి, మీనా, భవాని, సీమా, నస్రీన్, ధనమ్మ, పేరయ్య, లక్ష్మీ, విద్యార్థులు పాల్గొన్నారు



# ఆర్గానిక్ ప్రాడక్ట్స్ ప్రారంభోత్సవలో పాల్గొన్న ఎమ్మెల్యే బాలు నాయక్

దేవరకొండ జనవరి 10 వార్త మిర్రర్ : దేవరకొండ పట్టణ పరిధిలోని శ్రీ షిర్డీ సాయి బాబా ఆలయం ప్రాంగణంలో లోకసాని పద్మ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్గానిక్ ప్రాడక్ట్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అగ్రికల్చర్ & ఫార్మర్ వెల్ఫేర్ చైర్మన్ కోదండ రెడ్డితో కలిసి పాల్గొన్న దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అనంతరం ఎమ్మెల్యే ని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లోకాసాని పద్మ రెడ్డి కుంకుడుకాయలు మరియు ఇతర ప్రకృతి ఉత్పత్తులతో తయారుచేసిన షాంపూ డిష్ వాషర్,ఫ్లోరో క్లీనర్, హ్యాండ్ వాష్ వ్యవసాయమునకు ఫెర్టిలైజర్, పెస్టిసైడ్ మరియు ఫంగిసైడ్ తయారు చేయడం అభినందనీయం అన్నారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన ముఖ్య అతిథులు మాట్లాడుతూ మారుమూల ప్రాంతంలో మార్గానికి వ్యవసాయం చేసి జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చుకోవడం గొప్ప విషయం అని వ్యవసాయం ద్వారా ఆర్గానిక్ వ్యవసాయం చేసి పండించే వాటికి ఎక్కువ డిమాండ్ పెరుగుతుందని దానివల్ల రైతుల మరింత లాగబడే అవకాశం ఉందని వారన్నారు. ఆర్గానిక్ వ్యవసాయం చేసి నత్తంగా జాతీయ స్థాయిలో అవార్డు అందుకున్న ఒకే ఒక వ్యక్తిగా లోకసాని పద్మా రెడ్డి నిలిచారని వక్తలు అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అగ్రికల్చర్ & ఫార్మర్ వెల్ఫేర్ చైర్మన్ కోదండ రెడ్డి,తెలంగాణ రాష్ట్ర ఇంజనీరింగ్ ల సంఘం అధ్యక్షులు శ్యామ్ ప్రసాద్ రెడ్డి, దామోదర్ రెడ్డి,వ్యవసాయ కమిషన్ సభ్యులు కెవిన్ రెడ్డి, సీనియర్ నాయకులు కర్నాటి లింగా రెడ్డి,బ్రహ్మ శ్రీ సూర్య నాయరణ స్వామి, శ్రీ షిరిడి సాయిబాబా ట్రస్ట్ అధ్యక్షులు ఇల్లందుల శ్రవణ్ , కోశాధికారి కర్నాటి జనార్దన్ దేవరకొండ మాజీ సర్పంచ్ పున్న వెంకటేశ్వర్లు, చిత్రాల పిఎసిఎస్ చైర్మన్ జాల నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కల్వకుర్తి బిజెపి పట్టణ అధ్యక్షులుగా గన్నోజు బాబిదేవ్



కల్వకుర్తి జనవరి 10 వార్త మిర్రర్ ప్రతినిధి:-కల్వకుర్తి పట్టణ భారతీయ జనతా పార్టీ అధ్యక్షులుగా కల్వకుర్తి పట్టణం ఇందిరానగర్ కాలనీకి చెందిన గన్నోజు శివకృష్ణ (బాబిదేవ్) నియమితులయ్యారు. ఈమెరకు ఈ రోజు జిల్లా కేంద్రం నాగర్ కర్నూలులో జిల్లాకు చెందిన బిజెపి పార్టీ పదవులను ప్రకటించారు. భారతదేశంలోని ప్రధానమైన జాతీయ పార్టీ అధికార పార్టీ భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తెలంగాణ పై ప్రత్యేక దృష్టిపెట్టి మెరికల్లాంటి కొత్త నాయకులను నియమిస్తుంది. అందులో భాగంగా 35-45 ఏళ్ల వయసు మధ్య ఉన్న వారికి మాత్రమే ప్రధానమైన పదవులను ఇస్తున్నారు. అందులో భాగంగా కల్వకుర్తి పట్టణ అధ్యక్షునిగా గన్నోజు బాబిదేవ్ ని నియమించింది. త్వరలో కల్వకుర్తి మున్సిపాలిటీ ఎన్నికలు రాబోతున్నందున ఎలాగైనా ఈ సారి మున్సిపాలిటీపై బిజెపి జెండా ఎగరవేయాలననే ఉద్దేశంతో సీనియర్ నేత తల్లోజు ఆచారి ఉన్నారు. పట్టణ అధ్యక్ష పదవికి తీవ్రమైన పోటీ ఉంది.అన్ని కుల సమీకరణలు అంచనా వేసి తనకు నమ్మిన బంటుగా భావించి చాలా రోజులుగా పట్టణంలో చురుకుగా పనిచేస్తున్నందునా ఆయనను నియమించినట్టుగా తెలుస్తుంది. బిజెపి మాతృ సంస్థ అయినటువంటి ఆర్ఎస్ఎస్ స్వయంసేవక్ గా ప్రయాణం మొదలుపెట్టి ఆర్ఎస్ఎస్ అనుబంధ సంస్థ అయినటువంటి సక్ష్యంలో జిల్లా కార్యదర్శిగా కల్వకుర్తి మండల కోఆర్డినేటర్ గా పనిచేసిన అనుభవం కూడా ఉన్నది.బిజెపి పార్టీలో కల్వకుర్తి పట్టణ ఉపాధ్యక్షులుగా శక్తి కేంద్రం ఇన్చార్జిగా గత కొన్ని సంవత్సరాలుగా బాగా కష్టపడుతూ ఓటు బ్యాంకు లేని ఇందిరానగర్ కాలనీలో గత ఎమ్మెల్యే,ఎంపీ ఎలక్షన్లలో బిజెపికి లీడు తీసుకురావడంలో ముఖ్య పాత్రపోషించినారు.ఒక ప్రముఖ పారిశ్రామికవేత్తను రాజకీయంలోకి తీసుకొచ్చిన వ్యక్తిగా గుర్తింపు కలదు. కల్వకుర్తి పట్టణంలోని ఒక ఐదారు వార్డులపై ప్రభావం చూపే వ్యక్తిగా అధిష్టానం గుర్తించి కీలక సమయంలో ముఖ్యమైన బాధ్యత అప్పగించినట్టుగా తెలుస్తుంది. దీన్నిబట్టి రాబోయే స్థానిక ఎలక్షన్లలో బిజెపి గట్టి ప్రయత్నం చేస్తుందని మనం అనుకోవచ్చు.



# పాఠశాలలో సరస్వతీ విగ్రహానికి పూర్వ విద్యార్థులు చేయూత

## పాఠశాలకు దాతల కృషి అభినందనీయం

## ప్రధానోపాధ్యాయులు సీమలదారి సదాశివ్

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జనవరి 10 : జగిత్యాల జిల్లా రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కు దాతల కృషి అభినందనీయం అని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సీమలదారి సదాశివ్ అన్నారు. పాఠశాలలో సరస్వతీ విగ్రహానికి పాఠశాల పూర్వ విద్యార్థులు చేయూతనిచ్చారు. విద్యాలయం చదువులకు నిలయము గా ఉండాలని ఆకాంక్షిస్తూ సరస్వతి మాత ను ఆలయమును రంగుల తో తీర్చిదిద్దారు. ఐరెన్ గ్రిల్స్ ఏర్పాటు చేశారు. వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా వేద పండితులు చేరుకు మహేశ్వర శర్మ వేద మంత్రోచ్చారణలతో శుక్రవారం పాఠశాలలో సరస్వతీ దేవి కి ప్రత్యేక పూజలు నిర్వహించి పునః జీర్ణోద్ధరణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పాఠశాలకు మేయిన్ గేట్ ఏర్పాటు చేసిన 1998-99 పదవ తరగతి బ్యాచ్ వారిని, సరస్వతి మాతకు రక్షణ కొరకే ఐరెన్ గ్రిల్స్ ఏర్పాటు చేసిన 2002-03 పదవ తరగతి బ్యాచ్ వారిని, పిల్లలకు బ్యాగ్ లు ఇచ్చిన మాజీ ఎంపిపి కాటి పెల్లి గంగారెడ్డిని, 20 వేలతో అటెండర్ ను నియమించిన వి.డి.సి చైర్మన్ నల్ల గంగారెడ్డి యాదవ్, క్యాషియర్ మహేష్ ను, బ్యాగులు, బేంచీలు వీరాళం ఇచ్చిన మండలోజు శ్రీనివాస్ ను, కానిపర్తి శ్రీనివాస్ ను, గాజెంగి రాజేశం ను, కలర్స్ కు రెండు వేలు ఇచ్చిన ప్రసాద్ ను, తాజా మాజీ సర్పంచ్ సామల్ల లావణ్యవేణు ను, తాజా మాజీ ఎంపిటిసి కొమ్ము రాధ ఆదిరెడ్డి ని, మాజీ సర్పంచ్ మరి పెల్లి నారాయణ గౌడ్ ను, ప్రముఖ గాయకుడు, ఆధ్యాత్మిక వేత్త లింబాద్రి గౌడ్ ను, వివిధ రకాలుగా సహా సహకారాలు అందించిన, అందిస్తున్న, దాతలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఛైర్మన్ తాలుక లావణ్య లు ఘనంగా సన్మానించారు. తదనంతరం ప్రధానోపాధ్యాయుడిని, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఛైర్మన్ తాలుక లావణ్య లను దాతలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టి.వై.ఎం.ఎస్.ఈ.యు అధ్యక్షులు వేల్పుల స్వామి యాదవ్, రోట్టె శ్రీధర్, బోగ రాజు, హన్మంతరావు , ముక్కెర శేఖర్, ఎద్దండి రమేష్ రెడ్డి, స్వర్ణలత, శ్రీలత, నీరజ, నాగలక్ష్మి , జియావుద్దీన్, ముజాహీద్, నీరజ ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రామంతపూర్ స్పూర్తి డిగ్రీ మహిళా కళాశాలలో ఘనంగా సంక్రాంతి సంబరాలు

## ముగ్గుల పోటీలో గెలుపొందిన విద్యార్థినిలకు బహుమతులు అందజేసిన చైర్మన్ రాపర్తి సురేష్ గౌడ్





రామంతపూర్ వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్) : రామంతపూర్ స్పూర్తి డిగ్రీ మహిళా కళాశాలలో ఘనంగా సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు, సంక్రాంతి పండుగ విశిష్టత తెలుపుతూ స్పూర్తి డిగ్రీ మహిళా కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు ఉత్సాహంగా ఉల్లాసంగా జరుపుకున్నారు, పల్లె వాతావరణంలో ప్రతిబింబించేలా కళాశాలను అలంకరించి సంక్రాంతి పండుగ సమయంలో నిర్వహించే పలు కార్యక్రమాలు విద్యార్థులు, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది ఆనంద ఉత్సవాల మధ్య ఘనంగా జరుపుకున్నారు, విద్యార్థినిలు రంగురంగుల ముగ్గులు ఆ ముగ్గులపై గొబ్బెమ్మలు భోగిమంట ఆ మంట చుట్టూ నృత్యాలు చేస్తూ ఆనందంగా సాంప్రదాయబద్ధంగా ఘనంగా నిర్వహించుకుని, ముందస్తు సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతున్నారు, కళాశాల విద్యార్థినిలు, స్నేహపూర్వక ముగ్గుల పోటీలో గెలుపొందిన వారికి కళాశాల చైర్మన్ రాపర్తి సురేష్ గౌడ్ బహుమతులను అందజేశారు, ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థినీలు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు

# వైకుంఠ ఏకాదశి వేడుకల్లో శ్రీ ఆది మహావిష్ణు స్వామిని దర్శించుకున్న- శక్తి ఇన్ఫ్రా డెవలపర్స్ సభ్యులు

## స్వామివారి పల్లకి మోసిన బిజెపి నేత బోడ వెంకటరమణ గౌడ్-మిత్ర బృందం

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ నగర్) : యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దేవలంబ నాగారం గ్రామంలో వెలిసిన శ్రీ ఆది మహావిష్ణు ఆలయంలో 9వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా వైకుంఠ ఏకాదశి పర్వదినం నాడు శ్రీ ఆది మహా విష్ణు ఆలయానికి భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు, స్వామివారి పల్లకిలో ఊరేగింపు లో కార్యక్రమంలో స్వామివారి పల్లకి మోసిన బిజెపి సీనియర్ నాయకులు, బోడ వెంకటరమణ గౌడ్, వారి మిత్రబృందం, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ ఆదిమహావిష్ణు ఆలయానికి రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు చేరుకొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారని తెలిపారు ఈ కార్యక్రమంలో మాధగోని మోహన్ గౌడ్, దానయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు




# విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభాపాటవాలను వెలికితీయడానికి టాలెంట్ టెస్టులు ఉపయోగపడతాయి

మిర్యాలగూడ జనవరి 10:-( వార్త మిర్రర్) : విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభాపాటవాలను వెలికి తీసి ప్రోత్సహించుటకు లక్పతి నాయక్ మెమోరియల్, సమగ్ర భారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్టులు నిర్వహించడం అభినందనీయమని మండల విద్యాధికారులు బాలు, బాలాజీ నాయక్, లక్ష్మణ్ నాయక్, రవి లు పేర్కొన్నారు. గురువారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో లక్పతి నాయక్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహించబడే టాలెంట్ టెస్టుల గోడ పత్రికను విడుదల చేస్తూ సుదీర్ఘకాలం సామాజిక స్పృహతో ఉపాధ్యాయ వృత్తిలో పనిచేస్తూ లోకం విడిచిన లక్పతినాయక్ స్మారకార్థం కుటుంబ సభ్యులు విద్యార్థులలో ఉన్న ప్రతిభాపాటవాలను వెలికితీయుటకు టాలెంట్ టెస్టులు నిర్వహిస్తూ ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. విషయ నిపుణులచే పదవ తరగతి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారని ఉన్నత విద్యకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ధర్మానాయక్, తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు కొర్ర కృష్ణ కాంత్ నాయక్, ఫౌండేషన్ కన్వీనర్ పానుగోతు గోపినాథ్, సమగ్ర భారత్ ట్రస్ట్ కన్వీనర్ అజయ్, విజయ్ పాల్గొన్నారు.



# ఎల్ ఆర్ ఎస్ కోసం 14,328 దరఖాస్తులు వచ్చాయి, మార్చి 31లోగా సరియైన పత్రాలను సమర్పించాలి




మిర్యాలగూడ జనవరి 10:- (వార్త మిర్రర్) : ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న వారు మార్చి 31లోగా తమ దరఖాస్తులను క్రమాబద్ధికరించు కోకుంటే మూడింతలు పన్ను చెల్లించాల్సి ఉంటుందని స్థానిక మున్సిపల్ కమిషనర్ ఎండీ.యూసుఫ్ తెలిపారు. శుక్రవారం విలేఖరులతో ఆయన మాట్లాడుతూ మిర్యాలగూడ మున్సిపల్ పరిధిలో ఎల్ఆర్ఎస్ కోసం 14,328 దరఖాస్తులు వచ్చాయని వాటిలో 190 దరా?స్తులను పరిశీలించి ఆమోదం ఇచ్చామన్నారు. 2, 027 కొన్ని తప్పులు, 1877 దరఖాస్తులకు సరైన పత్రాలులేవన్నారు. ఎల్ఆర్ఎస్ వల్ల మున్సిపాలిటీకి ఇప్పటివరకు రూ.1.74 కోట్లు ఆదాయం వచ్చిందన్నారు. వేరే ప్రభుత్వ కార్యక్రమాల వల్ల మిగిలిన దరఖాస్తులను పరిశీలన జరగలేదని త్వరలో చేస్తామని ఆయన తెలిపారు. దరఖాస్తులకు రాష్ట్ర ప్రభుత్వం క్రమబద్ధీకరణకు గడువు ఇచ్చినదని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మున్సిపల్ పరిధిలో ఆస్తిపన్ను, నీటినల్లా, ఖాళీ స్థలాల(వీఎల్టీ)పై పన్నుల వసూలుకు స్పెషల్ డ్రైవ్ చేస్తున్నామని ఆయన తెలిపారు. మిర్యాలగూడ పట్టణంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం, పాత బకాయిలు ప్రైవేట్ భవనాలు, ప్రభుత్వ భావనాల పై ఆస్తి పన్ను రూ.20.18కోట్లు, ఇందులో ప్రభుత్వ భవనాల పై ఆస్తిపన్ను, ఇళ్లు, దుకాణాలు, అపార్ట్మెంట్లపై ఆస్తి పన్ను రూ.5.35 కోట్లున్నాయన్నారు. పన్నుల వసూలు కోసం స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిందని సంక్రాంతి సెలవుల తరవాత పన్నుల వసూలు ముమ్మరం చేస్తామని ఆయన తెలిపారు. అన్నారు. ఆయన వెంట రెవిన్యూ అధికారి జి.జ్ఞానేశ్వరి, టీపిఎస్ అంజయ్య, జెఎ జి.శంకర్ లున్నారు.

# నాంపల్లి ప్రభుత్వ కళాశాలలో ఘనంగా జాతీయ యువజన దినోత్సవాలు

## వ్యాసరచన,ఉపన్యాస,దేశభక్తి గేయాల పోటీలో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులకు బహుమతి ప్రధానం



నల్గొండ జిల్లా వార్త మిర్రర్ ప్రతినిధి (ఏలే భాస్కర్) : నాంపల్లి మండల కేంద్రము లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్వామి వివేకానంద ఉత్సవ సమితి ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవాలను పురస్కరించుకొని స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపల్ ముత్యం వెంకన్న మాట్లాడుతూ స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని స్వామి వివేకానంద ఆలోచనలు, ప్రవచనాలు,మరియు జీవిత శైలిలోని విలువలు యువతకు మార్గదర్శకంగా నిలిచాయి అని అన్నారు. ఆయన సందేశాలు మన సంస్కృతిని, ఆధ్యాత్మికతను, మరియు జాతీయతను నొక్కి చూపించాయని అన్నారు. స్వామి వివేకానంద ఉత్సవ సమితి అధ్యక్షులు కర్నాటి శ్రీహరి మాట్లాడుతూ స్వామి వివేకానంద నిరంతరం "లేవండి మేల్కొనండి లక్ష్యం చేరేవరకు విశ్రమించకండి" అని పిలుపునిచ్చారు అని అన్నారు. ఈ సందేశం ప్రతి ఒక్కరి జీవితానికి ప్రేరణగా నిలుస్తుంది అని,స్వామి వివేకానంద జయంతిని "జాతీయ యువజన దినోత్సవం"గా జరుపుకోవడం, యువతకు ఆయన ఆత్మవిశ్వాసం,పట్టుదల,మరియు నైతిక విలువలను చేరువ చేసే మంచి అవకాశంగా భావించాలి అని అన్నారు. ఈ సందర్భంగా, యువతకు స్ఫూర్తి కలిగించే కార్యక్రమాలు, వ్యాసరచన పోటీలు, ఉపన్యాస పోటీలు,దేశభక్తి గేయాల పోటీలు కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా మనం ఆయన ఆలోచనలకు అర్థం కల్పించగలము.మన యువత తమ శక్తి సామర్థ్యాలను సమాజం అభ్యున్నతికి ఉపయోగించి, స్వామి వివేకానంద చూపిన మార్గంలో ముందుకు సాగాలని అన్నారు. అనంతరం వివిధ పోటీల్లో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులకు కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ ముత్యం వెంకన్న, వివేకానంద ఉత్సవ సమితి అధ్యక్షులు కర్నాటి శ్రీహరి బహుమతి ప్రధానం చేశారు. స్వామి వివేకా నంద ఉత్సవ సమితి సభ్యులు నాంపల్లి శివ, కళాశాల అధ్యాపకులు రజినీకాంత్, శ్రీనివాస్,సైదులు,ముత్యాలు, ప్రసన్నలత,శైలజ,సమతా, కళాశాల ఎన్ ఎస్ ఎస్ యూనిట్ అధికారి శిరీష, ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు సందీప్, జయ శంకర్ నేత.విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



# ఊర్కొండ బీజేపి మండల నూతన అధ్యక్షుడిగా కటికం రాజేందర్ గౌడ్

## ::: ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్‌రెడ్డి

కల్వకుర్తి ఊర్కొండ జనవరి 10 వార్త మిర్రర్ ప్రతినిధి:-ఊర్కొండలోని భారతీయ జనతా పార్టీ మండల శాఖ మాజీ అధ్యక్షులు ఓర్సు ఆంజనేయులు ఆధ్వర్యంలో పాలమూరు జిల్లా కౌన్సిల్ నెంబర్ గా ఎన్నికైన ముచ్చర్ల లక్ష్మారెడ్డి కి నూతనంగా ఎన్నుకోబడిన ఊర్కొండ మండల అధ్యక్షులు రాజేందర్ గౌడ్ కి శుభాకాంక్షలు తెలియజేస్తూ వారిద్దరికీ అభినందనల కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర నాయకులు ముచర్ల జనార్దన్ రెడ్డి హాజరై నూతనంగా ఎన్నికైన పాలమూరు జిల్లా కౌన్సిలర్ నెంబర్ ముచ్చర్ల లక్ష్మారెడ్డికి అదేవిధంగా నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షులు రాజేందర్ గౌడ్ కి శాలువలతో సన్మానించి అభినందనలు తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో పెద్దలు ముచ్చర్ల జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ బాధ్యతలు స్వీకరించిన మీరు పార్టీ ని బలోపేతం చేస్తూ రేపు జరగబోయే స్థానిక ఎన్నికలలో సర్పంచులను ఎంపిటిసిలను జడ్పిటిసిలను గెలిపిస్తూ మండలానికి మంచి పేరు తీసుకురావడానికి కంకణబద్ధులై పని చేస్తారని కోరుకుంటున్నాను. అదేవిధంగా 17వ తారీకు జడ్చర్ల అసెంబ్లీ బిజెపి పార్టీ ఆఫీస్ నూతన ప్రారంభోత్సవం సందర్భంగా కార్యకర్తలందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మండల శాఖ కోరడమైనది. ఈ కార్యక్రమామలో జిల్లా మండల సీనియర్ నాయకులు వివిధ గ్రామాల కార్యకర్తలు హాజరు కావడం జరిగింది.




# క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయి క్రికెట్ టోర్నమెంట్ ను ప్రారంభించిన దశరథ్ నాయక్

కల్వకుర్తి కడ్తాల్ జనవరి 10 వార్త మిర్రర్ ప్రతినిధి:-కడ్తాల్ మండలంలోని సలార్ పూర్ గ్రామ పంచాయతీలో(స్ పీ ఎల్) సాలార్ పూర్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కడ్తాల్ మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా దశరథ్ నాయక్ మాట్లాడుతూ క్రీడలు మానసిక, శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని అదేవిధంగా మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని అన్నారు. సంక్రాంతి సందర్భంగా గ్రామీణ యువత క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం సంతోషకరమని అలాగే ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా టోర్నమెంట్ నిర్వాహకులు చొరవ తీసుకోవాలని టోర్నమెంట్ విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి ప్రియా రమేష్ పంతు నాయక్ సాయిలు నాయకులు బాబా జంగయ్య కుమార్ నరేష్ క్రీడాకారులు నాయకులు తదితరులు పాల్గొన్నారు



# ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన గణం నర్సింహ్మా కురుమ కుటుంబ సభ్యులు

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్) : ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య కురుమ గారిని తన నివాసంలో గణం నర్సింహ్మా కురుమ. లక్ష్మి దంపతులు వారి కుమారులు గిరిప్రసాద్ కురుమ. హరిప్రసాద్ కురుమ కుటుంబ సమేతంగా మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సరము మరియు ముక్కోటి ఏకాదశి శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా గణం నర్సింహ్మా కురుమ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 40 లక్షల జనాభా ఉన్న కురుమ కులంలో ఆలేరు ఎమ్మెల్యేగా గెలిచిన ఏకైక ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కురుమకు రాష్ట్ర ప్రభుత్వం మంత్రి పదవి కేటాయించి క్యాబినెట్ లోకి తీసుకోవాలని ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జరిగినటువంటి గత అసెంబ్లీ ఎన్నికల్లో కురుమలంతా కాంగ్రెస్ వైపే ఉన్నారని బీర్ల అయిలయ్య కు మంత్రి పదవి ఇచ్చినట్టైతే జరగబోయే అటువంటి స్థానిక సంస్థల ఎన్నికల్లో కురుమలు కాంగ్రెస్ కు అత్యధిక సీట్లు గెలిపించడానికి ముందు ఉంటారని ఈ సందర్భంగా ఆయన అన్నారు.




# ఈ ఫోటోలో ఉన్న వ్యక్తి ఆచూకీ తెలిపితే తగిన పారితోషకం

మిర్యాలగూడ జనవరి 10:- (వార్త మిర్రర్) మిర్యాలగూడ పోలీసులు గురువారం జారీచేసిన పోస్టర్లోని ఫోటోలో ఉన్న వ్యక్తులున్న గుర్తిస్తే వెంటనే తెలపాలని కోరారు. మిర్యాలగూడ పట్టణంలో, ఇతర ప్రాంతాలలో దొంగతనాలకు పాల్పడి తప్పించుకొని తిరుగుతున్నారని వ్యక్తులను ఏవరైన ఎక్కడైనా చూసినట్లయితే పోలీసులకు సమాచారం ఇచ్చినట్లయితే వారికి తగిన పారితోషికం ఇవ్వనున్నట్టు పోలీసులు తెలిపారు.